

వైసీపీ అధినేత జగన్‌రెడ్డి ఏరికోరి తెచ్చుకున్న ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హవా ఊహించినంతేమీ లేదని తేలిపోతోంది. ఆయన పరిచయ కార్యక్రమాలు పేలవంగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల వెలవెలబోతున్నాయి. ఆయన పసలేని ప్రసంగాలకు కార్యకర్తలు సైతం నీరసపడిపోతున్నారు. మంచి విందు ఏర్పాటు చేశాం రండహో అని చాటింపు వేసినా సమావేశపు హాళ్లు నిండడం లేదు. అన్ని ప్రాంతాల్లో పార్టీ ముఖ్య నేతలు సైతం డుమ్మా కొడుతున్నారు. ప్రత్యేకించి కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లో నిర్వహించిన సమావేశాలు తుస్సుమన్నాయి. కొన్ని చోట్ల మండలాల వారీ కాకుండా ఒక్కచోటనే ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు పరిమితమయ్యారు. పశ్చిమప్రాంతంలో అక్కడక్కడా సొంత కార్యాలయాలు, తానుండేందుకు అతిథి గృహాలు ఏర్పాటు చేసుకొన్న చెవిరెడ్డి.. ఒంగోలులో కనీసం ఆఫీసును కూడా తెరవకపోవడం చర్చనీయాంశమైంది. తనపై వచ్చిన స్మగ్లర్ అన్న ఆరోపణలను కూడా ఆయన తిప్పికొట్టే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.



అంత సీన్ లేదు!



సింగరాయకొండలో శనివారం ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరిచయ కార్యక్రమంలో ఖాళీగా ఉన్న కుర్చీలు(ఫైల్)

- పేలవంగా చెవిరెడ్డి పరిచయ సమావేశాలు
- కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లో వెలవెల
- గిద్దలూరులో అన్ని మండలాలకూ వెళ్లని వైనం
- ఒంగోలులో ఆఫీసు కూడా పెట్టని వైసీపీ ఎంపీ అభ్యర్థి
- సమస్యల ప్రస్తావనే కరువు
- ఆరోపణలకు సమాధానమే లేదు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా స్థానిక నాయకులందరినీ కాదని తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని వైసీపీ తరఫున సీఎం జగన్ రంగంలోకి దింపారు. స్థానికుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని అనేక మంది ఆపార్టీ నాయకులు పట్టుబట్టారు. ఈవిషయంలో ఆపార్టీ సీనియర్ నాయకుడు బాలినేని చివరి వరకు జగన్‌తో ఫైట్ కూడా చేశారు. కానీ ఆయన వినిపించుకోలేదు. ఎంపీగా ఉన్న మాగుంటను తన గడప కూడా తొక్కవద్దంటూ హెచ్చరించిన జగన్.. నియోజకవర్గంలోని వైసీపీ నాయకుల అభిప్రాయానికి భిన్నంగా ఎక్కడో ఉన్న రాయలసీమకు చెందిన చెవిరెడ్డిని ఇక్కడ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆరంభంలో ఆయన హడావుడి అధికంగా కనిపించింది. ఆపార్టీ తరఫున అసెంబ్లీ అభ్యర్థులుగా రంగంలో ఉన్నవారికి ఆర్థిక చేదోడును కూడా ఇచ్చి ప్రోత్సహించినట్లు వినిపించింది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో వలంటీర్లకు ఇచ్చిన తాయిలాలు ఆయన ఘనతేనని బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అన్ని ప్రాంతాల్లో తన సొంత మనుషులు ఉండేందుకు విడిది భవనాలను, ఆయన బస చేసేందుకు ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటుచేసుకుంటూ హడావుడి చేశారు. ఏప్రాంతంలో ఆయన విడిది అతిథిగృహం వద్ద చూసినా వాహనాల రాకపోకలు అధికంగా కనిపిస్తున్నాయి. అయితే ఒంగోలులో మాత్రం ఆయన ఉండేందుకు కూడా వసతిని ఏర్పాటు చేసుకోలేదు. ఎప్పుడో వస్తూపోతూ లాడ్జిలలోనే దిగుతున్నట్లు సమాచారం. తన సొంత మనుషులు నియోజకవర్గంలో తిరగడం కూడా ఒంగోలులో పెద్దగా కనిపించడం లేదు. పశ్చిమప్రాంతంలోని కొన్ని నియోజకవర్గాలలో రోజువారీ చెవిరెడ్డి అనుచరులు గ్రామాలకు వెళ్లి హడావుడి చేయడం కనిపిస్తోంది. అయితే ఒంగోలులో మాత్రం అలాంటి పరిస్థితి లేదు. ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని అంటే భయంతోనో, నమ్మకంతోనో ఆయన ఇక్కడ తన మనుషులను దూరంగా ఉంచి ఉండవచ్చని భావిస్తున్నారు.

బూచేపల్లి ప్రసంగాలతో బిత్తరపోయిన వైనం

దర్శి నియోజకవర్గంలో జరిగిన పరిచయ కార్యక్రమాల్లో అసెంబ్లీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేసిన ప్రసంగాలతో చెవిరెడ్డి సైతం బిత్తరపోయారు. బూచేపల్లి తన ప్రసంగంలో పార్టీ కార్యకర్తలు అనకుండా నా కార్యకర్తలు.. నా కార్యకర్తలు అంటూ మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు గతంలో కాంగ్రెస్‌కు లేదా వైసీపీకి పట్టం కట్టారని అనకుండా అప్పుడు రాజశేఖర్‌రెడ్డికి.. ఇప్పుడు జగన్‌కే మద్దతుగా నిలిచారని పొగిడారు. వెన్నుపోటుదారులున్నారు, వారి సంగతి చూస్తానంటూ హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాల్లో పొదిలిలో జరిగిన సమావేశం ఫర్వాలేదనిపించగా మిగిలిన మండలాల్లో పేలవంగానే జరిగాయి. ఆదివారం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఆయన పరిచయ కార్యక్రమాల కూడా వైసీపీ శ్రేణుల నుంచి ఆశించిన స్పందన కరువై వెలవెలబోయాయి.

పేలవంగా సమావేశాలు

అన్ని నియోజకవర్గాల్లో మండలాల వారీ పరిచయ కార్యక్రమాలకు చెవిరెడ్డి శ్రీకారం పలికారు. ఇప్పటి వరకూ జరిగిన కార్యక్రమాలన్నీ పేలవంగా జరిగాయి. శనివారం కొండపి అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన పరిచయ కార్యక్రమాలు, అంతకుముందు కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనాలు వెలవెలబోయాయి. నియోజకవర్గ కేంద్రమైన కనిగిరిలో వేసిన 600 కుర్చీలే నిండలేదు. అయితే సమావేశం కిటకిటలాడినట్లు ప్రచారం చేసుకున్నారు. పీసీపల్లి, పామూరు మండలాల్లో జరిగిన కార్యక్రమాలు మొక్కుబడిగా సాగాయి. అంతోఇంతో సీఎస్‌పురం, వెలిగండ్ల సమావేశాలకే ఆపార్టీ శ్రేణులు హాజరయ్యాయి. కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి నారాయణయాదవ్‌ను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ మర్యాదకోసమైనా ఒక్క సమావేశానికి కూడా హాజరుకాలేదు. ఇక మధుసూదన్ యాదవ్‌కు మద్దతిస్తూ నియోజకవర్గంలో అసమ్మతిగళం వినిపిస్తున్న పలువురు నాయకులు ఆయా మండలాల్లో చెవిరెడ్డి నిర్వహించిన సమావేశాలకు గైర్హాజరయ్యారు. శనివారం కొండపి నియోజకవర్గంలో జరిగిన ఆయన పరిచయ కార్యక్రమాల తీరుతెన్ను కూడా అలానే కనిపించింది. కీలకమైన కొండపి, సింగరాయకొండలలో జరిగిన సమ్మేళనాలు బోసిపోయాయి. మిగిలిన మండలాల్లో కూడా వందల సంఖ్యలో తప్ప కనీసం వెయ్యి మంది కూడా ఎక్కడా హాజరుకాలేదు. ఇక సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ వెంకయ్యతోపాటు ఆయా మండలాల్లో అంతో ఇంతో ప్రజలతో సంబంధాలున్న పలువురు నాయకులు ఈ సమావేశాలకు డుమ్మా కొట్టారు. గిద్దలూరు నియోజకవర్గంలో మండలాల వారీ కాకుండా ఒక్క గిద్దలూరులో మాత్రమే పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ నగర పంచాయతీ, రూరల్ మండలాలకు సంబంధించి హాజరైన పార్టీ శ్రేణులతో సమావేశ మందిరమే నిండలేదు. అంతకు ముందు కార్ల ర్యాలీతో మాత్రం హడావుడి చేశారు.

పసలేని ప్రసంగాలు

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రసంగాలలో పసలేకపోవడం ఆపార్టీ శ్రేణులను నిరుత్సాహపరుస్తోంది. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు కొద్దిరోజుల క్రితం మార్కాపురంలో జరిగిన సభలో చెవిరెడ్డి ఎర్రచందనం స్మగ్లర్ అని బహిరంగంగానే ఆరోపించారు. ఇక ఇతరత్రా అనేక ఆరోపణలు ఆయన మీద ఉన్నాయి. స్థానికంగా అందుబాటులో ఉండరన్న ప్రచారం జరుగుతోంది. అయితే ప్రతి సమావేశంలో ఆయన మూడంటే మూడు మాటలే చెబుతూ 'నేను నాయకుడిని కాదు. మీ సేవకుడిని. మీకు అందుబాటులో ఉంటాను' అని చెప్పి ముగించేస్తున్నారు. ఆయనపై ప్రతిపక్షనేతలు చేసిన ఆరోపణలను ఖండించడం కానీ, సవాల్ చేయడం కానీ జరగ లేదు. లోక్‌సభ పరిధిలోని స్థానిక సమస్యలను కానీ, ఢిల్లీ స్థాయిలో ఆయన వ్యవహరించబోయే తీరును గురించి కానీ ప్రస్తావించడం లేదు. దీంతో ఆయన ప్రసంగంలో పసలేక ఆపార్టీ శ్రేణులే నీరసపడుతున్నాయి.

సర్కారు వైన్స్ టూ బెల్ట్‌షాప్!

- మద్యం అక్రమంగా తరలింపు
- సేల్స్‌మన్, గొలుసు దుకాణం నిర్వాహకుడు అరెస్టు
- 100 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం



మద్యాన్ని చూపిస్తున్న ఈఎస్

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 14 : ప్రభుత్వ దుకాణం నుంచి బెల్ట్ షాపునకు మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ఈబీ అధికారులు అరెస్టు చేశారు. 100 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్ ఆదివారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. టంగుటూరు మండలం కందులూరులో ఎస్ఈబీ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గోతాం పట్టుకొని అనుమానాస్పదంగా కనిపించిన కొణిజేడుకు చెందిన శ్రీరాం శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. పరిశీలించగా మద్యం బాటిళ్లు కనిపించాయి. అతడిని విచారించగా కందులూరులోని మద్యం దుకాణంలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్న కొప్పోలుకు చెందిన మాదాల చైతన్య క్వార్టర్ బాటిల్‌కు ఎమ్మార్పీకంటే అదనంగా రూ.10 తీసుకొని తనకు విక్రయించినట్లు చెప్పారు. దీంతో ఇద్దరినీ అరెస్టు చేశారు. చైతన్యను సేల్స్‌మన్ ఉద్యోగం నుంచి తొలగించాలని ఎక్సైజ్ అధికారులకు సిఫార్సు చేశామని తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మన్‌లు, సూపర్ వైజర్లు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసే 30 మంది సిబ్బందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎస్ఈబీ సీఐ వంశీధర్, ఒంగోలు ఎస్ఈబీ స్టేషన్ సీఐ జి.సూర్యనారాయణ, ఎస్సై సిహెచ్.గీత, కానిస్టేబుల్ ఏడుకొండలు పాల్గొన్నారు.

టీడీపీ చీరాల ఎన్నికల సమన్వయకర్తగా ముప్పవరపు



వీరయ్యచౌదరిని అభినందిస్తున్న నేతలు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 14 : టీడీపీ చీరాల నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్తగా ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా వీరయ్య చౌదరిని టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, విజయ్‌కుమార్, పాండురంగారావు, మురళి తదితరులు నాగులుప్పలపాడులో అభినందించారు. చీరాలలో టీడీపీ అభ్యర్థి కొండయ్య విజయానికి కృషి చేస్తానని వీరయ్యచౌదరి పేర్కొన్నారు.

జగన్ అరాచక పాలనను అంతమొందించాలి

- ప్రజలకు టీడీపీ నేతల పిలుపు
- పార్టీ కార్యాలయాలు, ఇతర చోట్ల ఘనంగా అంబేడ్కర్ జయంతి
- వివిధ దళిత, ప్రజా సంఘాలు, ఇతర వర్గాలు నివాళి



టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో మాగుంట, జనార్దన్, యోగయ్యయాదవ్, రియాజ్ తదితరులు

ఒంగోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కి రాష్ట్రంలో ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనను అంతమొందించాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ కూటమిని గెలిపిస్తేనే రాష్ట్రంలో ప్రజలకు భద్రత, హక్కుల రక్షణ ఉంటుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు ఆయా వర్గాల వారు నివాళులర్పించారు.

నియోజకవర్గాల వారీ కార్యక్రమాలు ఇలా..

జిల్లావ్యాప్తంగా టీడీపీ శ్రేణులు అంబేడ్కర్ జయంతిని పెద్ద ఎత్తున నిర్వహించాయి. పలుచోట్ల ఆపార్టీ తరఫున ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని అం బేడ్కర్‌కు నివాళులర్పించారు. ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూటమి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. కూటమి కొండపి అభ్యర్థి డీఎస్‌బీవీ స్వామి టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో, సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్ విజయకుమార్ పేర్నమిట్ట, చీమకుర్తి, సంతనూతలపాడులలో జరిగిన కార్యక్రమా ల్లో పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కనిగిరి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆ నియోజకవర్గంలోని కనిగిరి, వెలిగండ్ల, సీఎస్‌పురం ప్రాంతాల్లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. దర్శి పట్టణంలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పశ్చిమ ప్రాంతంలోని టీడీపీ కూటమి అభ్యర్థులు, ఇతర నేతలు ఎక్కడికక్కడ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ఆయా వర్గాల అభ్యున్నతి కోసం గతంలో టీడీపీ అమలు చేసిన అనేక పథకాలను అటకెక్కించిందన్నారు. దళితులు, బీసీలకు జగన్ పాలనలో రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఎక్కడ చూసినా భూకబ్జాలు, దౌర్జన్యాలు, ప్రశ్నించిన వారిపై దాడులు, వేధింపులు పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో జగన్ సర్కార్‌కు చరమగీతం పాడితేనే రాష్ట్రంలో ప్రజల హక్కులకు రక్షణ ఉంటుందన్నారు. కాగా వివిధ పార్టీలు, దళిత. ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ ఆయా ప్రాంతాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి.

ఒంగోలులో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల, ప్రకాశం భవన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాలకు కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, దళిత సంఘాల నేతలు

ఎస్ఎన్‌పాడుతో విడదీయరాని బంధం

- ఇక్కడ ప్రజాసేవకే జీవితం అంకితం
- వలస నేతలు ఎప్పుడూ శాశ్వతం కాదు
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'సంతనూతలపాడు నియోజకవర్గంతో నాకున్న రాజకీయ బంధం శాశ్వతం. ఇక్కడి ప్రజల సేవకే నా జీవితం అంకితం. పార్టీ కార్యకర్తలే నాకు ప్రాణం. అందుకే గెలుపోటములకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. గతంలో చేసిన ప్రగతి పనులు, ప్రజాసేవ కార్యక్రమాలను ప్రచారం చేస్తూ.. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నా. అవే నా విజయానికి బాటలు వేస్తాయి' అని టీడీపీ కూటమి సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ఆయన ఆదివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని అంశాలపై స్పష్టమైన అభిప్రాయాలను వెల్లడించారు. 'అప్పట్లో విధిలేని పరిస్థితుల్లో పార్టీ మారా. కానీ నియోజకవర్గం మారే సమస్యే లేదు. ఇతరత్రా ప్రాంతాల్లో సరికొత్త అవకాశాలు ఇస్తామన్నా ప్రప్రథమంగా నన్ను ఆదరించిన నియోజకవర్గ ప్రజలకే జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకున్నా' అని స్పష్టం చేశారు.



ఆరంభంలో ఎమ్మెల్యేగా, ఆతర్వాత తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఆపార్టీ ఇన్‌చార్జిగా నియోజకవర్గానికి చేసిన ప్రజాసేవ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. పార్టీ రహితంగా ఆపదలో ఉన్న పేదలకు అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించిన విషయాన్ని గుర్తు చేశారు. తాగు, సాగు నీటి రంగాల అభివృద్ధికి చేసిన కృషి, సాధించిన అనేక పథకాలను వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో తాగు, సాగు నీటి రంగాలకు, రహదారుల అభివృద్ధికి సంబంధించి తాను మంజూరు చేయించిన అనేక పథకాలను వైసీపీ ప్రభుత్వం మధ్యలో ఆపేసిందని విమర్శించారు. వీటన్నింటినీ ప్రజలకు గుర్తు చేస్తున్నానని చెప్పారు. ఒక ప్రశ్నకు బదులుగా.. 'తనపై పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థి ఇప్పుడు మంత్రి కావచ్చు. నోటిఫికేషన్‌కు ముందు ఏదో చేస్తున్నట్లు నియోజకవర్గంలో హడావుడి చేయవచ్చు. కానీ ఆయనకు సంతనూతలపాడు శాశ్వతమా? అనే విషయాన్ని ప్రజలు ఆలోచించుకోవాలి. అక్కడెక్కడో వేమూరుకు ఎమ్మెల్యేగా ఉన్న ఆయన మంత్రిగా అక్కడ ఏమి చేశారో, ఎలాంటి అవినీతి వ్యవహారాలు సాగించారో ప్రజలకు తెలియంది కాదు. వేమూరు శాశ్వతమని గత ఎన్నికల్లో చెప్పిన ఆయన ఇప్పుడు సంతనూతలపాడు శాశ్వతం అని తాత్కాలికంగా చెప్పవచ్చు. అందుకే ప్రజలు నియోజకవర్గ సేవకు ఎవరు అంకితమయ్యారు, భవిష్యత్తులో కూడా ఎవరు ఉండబోతున్నారన్నది ఆలోచించి నాకు మద్దతు ఇవ్వాలి' అని కోరారు.

వచ్చేనెల 24నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఈనెల 24లోపు రీకౌంటింగ్‌కు దరఖాస్తు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 14 : ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు ఉదయం 9నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయి. విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులతోపాటు అదనపు మార్కులు సాధించేందుకు పాసైన సబ్జెక్టుల్లో బెటర్‌మెంట్‌కు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 18నుంచి 24లోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు మే 1నుంచి 4 వరకు జరుగుతాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం మార్కుల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు విద్యార్థులు ఈనెల 18నుంచి 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి జవాబు పత్రం నకలును పోస్టులో పంపుతారు.

టీచర్ల డిప్యుటేషన్‌లు రద్దు

పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 14 : రాష్ట్రంలో ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు, పని సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేస్తూ పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రకారం 2023-24 విద్యా సంవత్సరం చివరి పనిదినమైన ఈనెల 23న ప్రస్తుతం డిప్యుటేషన్, పనిసర్దుబాటులో పనిచేస్తున్న స్థానం నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుంది. అదేరోజు సాయంత్రానికి తమ మాతృస్థానంలో అంటే జీతం పొందుతున్న పాఠశాలల్లో విధుల్లో చేరాలి. ఫారిన్ సర్వీసు నిబంధనలతో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న టీచర్లను మాత్రం రిలీవ్ చేయకుండా యథాతథంగా కొనసాగించాలని ఆ ఉత్తర్వుల్లో డీఈవోలను, ఆర్జేడీలను కమిషనర్ ఆదేశించారు.

హవ్వ.. ఇంత దారుణ పరిస్థితా..!

- ప్రజలకు గుక్కెడు నీరు కూడా ఇవ్వలేని దుస్థితి?
- విద్య, వైద్య, పారిశ్రామిక ప్రగతి కరువు
- రాజకీయమే కాదు.. వైద్య సేవలూ ఇక్కడే
- టీడీపీ కూటమి దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు :

'నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజల బాధలు తెలుసుకుంటుంటే ఆశ్చర్యమేస్తోంది. జిల్లా ఏర్పడి రమారమి 55 ఏళ్లు అయింది. అయినా గుక్కెడు మంచి నీళ్లు ఇస్తే చాలమ్మా.. అంటూ ప్రజలు అడుగుతుంటే బాధేస్తోంది. సాగు, తాగు నీరు అందించలేని.. విద్య, వైద్య సౌకర్యాలు సమకూర్చలేని పాలకులు అవసరమా అని ఆవేదన చెందా. అందుకే దర్శి నియోజకవర్గ ప్రజల సేవకు జీవితం అంకితం చేయాలని నిర్ణయించుకున్నా. రాజకీయంగానే కాదు.. వృత్తిపరమైన వైద్య సేవలు కూడా అందిస్తా' అని టీడీపీ కూటమి దర్శి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భావోద్వేగంతో చెప్పారు. ముమ్మర ప్రచారంలో ఉన్న ఆమె ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై విస్పష్టమైన అభిప్రాయాలను తెలిపారు. దర్శి నియోజకవర్గంలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి ఆశ్చర్యం వేసిందన్నారు. ఎక్కడ చూసినా తాగునీటి సమస్య తాండవిస్తున్నదన్నారు. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారంలో ఎందుకు విఫలమయ్యారో గత పాలకులు సమీక్షించుకోవాలని సూచించారు. ఒకవైపు పుష్కలంగా సాగునీరు కూడా లేదన్నారు. ఇంకోవైపు విద్య, వైద్య రంగాల అభివృద్ధిలో నియోజకవర్గం బాగా వెనుకబడిపోయిందన్నారు.



పారిశ్రామిక రంగ ప్రగతి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉందని డాక్టర్ లక్ష్మి వివరించారు. చిత్తశుద్ధితో ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తే ఈ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. అందుకే దర్శిని రాజకీయ కేంద్రంగానే కాక, నివాస, సేవా కేంద్రంగా మార్చుకోవాలని తాను నిర్ణయించుకున్నానని ఆమె స్పష్టం చేశారు. రాజకీయంగా ఇక్కడే ఉండి సేవ చేస్తానని, అదే సమయంలో అధునాతన వైద్య పరికరాలతో వైద్యశాల ఏర్పాటు చేసి వృత్తిపరమైన వైద్య సాయం కూడా అందిస్తానని చెప్పారు. 'నా తాత గొట్టిపాటి హనుమంతరావు గొప్పవారు. నా తండ్రి నరసయ్య ప్రజాసేవ చేశారు. వారి నుంచి నేను చాలా మెలకువలు తెలుసుకున్నా. ఇప్పుడు చంద్రబాబు అవకాశం ఇచ్చారు. దర్శిలో ఉండి ఈ నియోజకవర్గ ఆడపడుచుగా ప్రజాసేవ ఎలా చేయాలో, నియోజకవర్గ అభివృద్ధి ఎలా సాధించాలో చూపిస్తా' అని డాక్టర్ లక్ష్మి స్పష్టం చేశారు. ఒక ప్రశ్నకు బదులుగా 'అవును.. గతంలో చాలామంది ఎన్నికల సమయంలో మేము మీతో ఉంటామని ప్రజలకు చెప్పి ఉండవచ్చు. ఆతర్వాత కుటుంబాన్ని మహానగరాల్లో పెట్టి అక్కడ వ్యాపారాలు చేస్తూ సమీప ప్రాంతాల్లో ఉంటూ అప్పుడప్పుడూ వచ్చిపోతుండవచ్చు. కానీ నాభర్త కుటుంబం వైద్యం, రాజకీయం, వ్యాపారం ఏదైనా నరసరావుపేటలోనే చేశారు. ఇదే తరహా నేనూ రాజకీయం, ప్రజాసేవ, వైద్య సేవ అన్నీ దర్శి నియోజకవర్గంలోనే చేస్తా. రానున్న కొద్దిరోజుల్లోనే దర్శిలోనే నివాసం ఏర్పాటు చేసుకొంటా' అని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి హామీ ఇచ్చారు.

నమ్మిన చేతులను నరికేసే మనస్తత్వం బాలినేనిది !

- టీడీపీ కూటమి నేతల ధ్వజం
- 36వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభం
- హాజరైన ఒంగోలు అభ్యర్థి దామచర్ల
- యువత, వైద్యులతో ఆత్మీయ సమావేశాలు



నిర్మల్‌నగర్‌లో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్



యువత సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దామచర్ల, రియాజ్, యోగయ్యయాదవ్

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 14: నమ్మిన వ్యక్తుల చేతులను నరికేసే మనస్తత్వం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిదని టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. ఆదివారం ఒంగోలు నగరంలోని 36వ డివిజన్ నిర్మల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని తెలుగుదేశం కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌర్జన్యాలు, గొడవలు సృష్టించి ఎన్నికల్లో సానుభూతి పొందాలని చూస్తున్న ఒంగోలు వైసీపీ నేతకు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారన్నారు. బెదిరింపులకు భయపడే మనస్తత్వం తమకు లేదని చెప్పారు. ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారని, నెలరోజులు ఓపిక పడితే అన్నీ బయటపడతాయని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. అనంతరం బీజేపీ నాయకుడు ఈదర మోహన్‌బాబు మాట్లాడుతూ నమ్మిన చేతులను నరికేసే మనస్తత్వం ఎమ్మెల్యే బాలినేనిదని, ఆయనకు అత్యంత సన్నిహితుడుగా, ఆయన గెలుపు కోసం కష్టపడి పనిచేసిన తనకు వాస్తవాలు తెలుసన్నారు. పదవి కోసం ఎంతటి నీచ రాజకీయాలకైనా బాలినేని దిగజారుతారని, ఆయన అమాయకంగా చెప్పే మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దని కోరారు. వైశ్య నాయకుడు సుబ్బారావుగుప్తా మాట్లాడుతూ బాలినేని బెదిరిపులు, దౌర్జన్యాలు, దాడులకు ఇక్కడ ఎవరూ భయపడరన్నారు. భయం ఉన్నవాడే ఎదురు దాడులకు దిగుతారని చెప్పారు. తనను అన్యాయంగా కొట్టిన బాలినేని కుటుంబం పతనం మొదలైందన్నారు. త్వరలోనే తాను అన్ని విషయాలు వాస్తవాలతో వెల్లడిస్తానని, బాలినేని ఓటమి, పతనం మొదలైందని చెప్పారు. కార్యక్రమంలో మండవ మురళీకృష్ణ, గోరంట్ల రవికుమార్, బెజవాడ మురళీ, బెజవాడ వెంకట్రావు, పోనాట ఆంజనేయులు, కంచర్ల సుబ్బారావు, నల్లూరి ప్రదీప్, దాయనేని ధర్మ, యర్ర పార్థసారథి, దుగ్గినేని వెంకట్రావు పాల్గొన్నారు.

బాబుతోనే యువతకు బంగారు భవిష్యత్తు

చంద్రబాబుతోనే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత యువత గురించి పట్టించుకోలేదన్నారు. జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని, దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా ఏపీకి సంబంధించిన గంజాయి లభిస్తుందన్నారు. ఇటీవల విశాఖలో 25వేల కిలోల కిలోల డ్రగ్స్ దొరకడం, అందులో వైసీపీ నేతల భాగస్వామ్యం ఉందని అధికారులు కూడా గుర్తించారన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్‌తోపాటు, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత చదువులకు, నిరుద్యోగులకు కార్పొరేషన్ రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. కూటమి గెలుపు కోసం యువత కృషి చేయాలని కోరారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యువత భవిష్యత్ కోసమే కూటమితో పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. బీజేపీ నేత యోగయ్యయాదవ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలతోపాటు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అందరు కలిసి ఎన్డీయే కూటమిని గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, నాయకులు కొఠారి నాగేశ్వరరావు, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్, ఎద్దు శశికాంత్‌భూషణ్, మలగా రమేష్, బొద్దులూరి ఆంజనేయులుతో పాటు మూడు పార్టీల యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామచర్ల, రియాజ్, యోగయ్య యాదవ్‌లను ఘనంగా సన్మానించారు.

టీడీపీ హయాంలోనే వైద్యరంగం అభివృద్ధి

తెలుగుదేశం పార్టీ హయాంలోనే పేదలకు మెరుగైన అభివృద్ధి, వైద్యులకు రక్షణ, భద్రత లభించిందని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఆస్టోనా హోటల్‌లో వైద్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా లక్షలాదిమంది పేదలకు ఉచితంగా అందించినట్లు తెలిపారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేశారని, డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగినందుకు నిర్దాక్షిణ్యంగా చంపేశారన్నారు. ఆసుపత్రులో కనీస మందులు కరువయ్యాయని ఆరోపించారు. వైద్యులకు భరోసా, రక్షణ కోసం టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు షేక్ రియజ్, డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నాదెండ్ల చంద్రశేఖర్, కొమ్మి నరసింగరావు, శ్రీధర్, శ్రీమన్నారయణ, బిందు, మరో వందమంది వైద్యులు పాల్గొన్నారు. అంతకముందు స్థానిక చంద్రయ్యనగర్‌లో టీడీపీ నాయకులు పోతంశెట్టి పవన్‌కమార్ నివాసంలో, 15వ డివిజన్‌లో కాపు నాయకులు కొక్కిరాల సంజీవ్‌కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న దామచర్ల త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపు కోసం సహకారం అందించాలని కోరారు.

మడనూరు వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరిక

కొత్తపట్నం మండలం, మడనూరు గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. వైసీపీ నాయకులు కన్నదారి శ్రీను, మిడసల రామాంజనేయులు, సాదు శివకోటయ్య, కడియం ఈశ్వరమ్మ, కొమ్మూరి బుజ్జి, పిట్ల సుబ్బలక్ష్మి, సుక్కపల్లి సుమతితోపాటు మరో 45 కుటుంబాల వారు వైసీపీ నుంచి ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో చేరగా దామచర్ల కండువాలు కప్పి ఆహ్వానించారు.

నియోజకవర్గాలకు ఈవీఎంల తరలింపు

- పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 14 : జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలను ఆదివారం తరలించారు. ఒంగోలు మామిడిపాలెంలో ఉన్న గోడౌన్ నుంచి వీటిని పంపారు. అక్కడి ప్రక్రియను కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ఈవీఎంల వివరాలను క్యూఆర్ కోడ్ ద్వారా సిబ్బంది స్కాన్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా గట్టి పోలీసు భద్రత మధ్య సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈవీఎంలను తరలిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓటింగ్ మిషన్‌లను పంపామని, ఆదివారం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంల తరలింపును ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ సుమిత్‌సునీల్

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్పీ జి.సుమిత్ సునీల్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నగరంలోని ప్రత్యేక దళాలతో పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం ప్రకాశంభవన్ వద్ద ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, అశోక్‌బాబు, డీఎస్పీ కె.కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు రైల్వే స్టేషన్‌లో రూ.7లక్షలు స్వాధీనం

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 14: ఒంగోలు రైల్వేస్టేషన్‌లో రూ.7లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే సీఐ శ్రీకాంత్‌బాబు ఆదివారం తెలిపారు. కావలి నుంచి శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో గిద్దలూరుకు చెందిన పెసల నిఖిల్‌కుమార్, పద్మ దంపతులు ఒంగోలు రైల్వేస్టేషన్‌లో దిగారు. వారిని పోలీసులు తనిఖీ చేయగా నగదు గుర్తించి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో చంద్రబాబు పరిపాలన

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ • ఘనంగా దళితుల ఆత్మీయ సమావేశం • కదంతొక్కిన నాయకులు, కార్యకర్తలు



దళితుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్



అగ్రహారంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఎన్

సంతనూతలపాడు, ఏప్రిల్ 14: రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన చేసిన గొప్ప నాయకుడు చంద్రబాబునాయుడు అని తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం సంతనూతలపాడులోని అంబేడ్కర్‌భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి, పేర్నమిట్ట, ఎండ్లూరు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతనూతలపాడులో జరిగిన టీడీపీ దళితుల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. తొలుత సమావేశానికి దళిత నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు దేశంలో ఎక్కడ లేనివిధంగా ప్రజారంజకంగా ఉన్నాయని, చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే వాటివల్ల ఎన్నో కుటుంబాలకు ఆర్థిక ఆసరా లభిస్తుందని చెప్పారు. దళితుల అభ్యున్నతి కోసం చంద్రబాబు నాడు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తే వాటిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. నియోజకవర్గంలో నాడు టీడీపీ చేపట్టిన శాశ్వత తాగునీటి పథకాలు, శాశ్వత రోడ్డు నిర్మాణాలు ప్రజలందరూ గుర్తించాలని, వైసీపీ పాలకులు ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని ఆరోపించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా నిలబడ్డ తనకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేనిహరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకాస్వాములు, నాయకులు వివరం గోవిందు, దార్ల రామారావు, తేళ్ల మనోజ్, టి.నరసింహారావు, ప్రభాకర్, సంగీతరావు, జాన్సన్, గోపి, బుజ్జి, జోసేఫ్, శ్రీను, కోటిరెడ్డి, సుబ్బారావు, ఆనంద్, ఫణీంద్ర, యలమంద, రామారావు, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. కాగా పేర్నమిట్టలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుకూరు బాబు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమానికి కృషి

చీమకుర్తి: బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం తాను బాసటగా నిలుస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని కె.అగ్రహారం, చీమకుర్తి పట్టణంలోని క్రిస్టియన్‌పాలెంలో నిర్వహించారు. కె.అగ్రహారంలో బీఎన్‌కు అఖండ స్వాగతం లభించింది. విజయ్‌కుమార్ మండుటెండలో ఇంటింటా తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టియన్‌పాలెంలో పర్యటించగా స్థానికులు బ్రహ్మరథం పట్టారు. సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు కలిగే లబ్ధిని వివరించారు. క్రిస్టియన్‌పాలెంలో మహిళలు, ఎంఆర్‌పీఎస్ శ్రేణులు బీఎన్‌కు అఖండ స్వాగతం పలుకటం విశేషం. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, రామబ్రహ్మం, తిరుమల, పాటిబండ్ల భిక్షలు, మల్లవరం కోటేశు, కోటయ్య, ఆలూరి భిక్షాలు, కర్ణా ప్రసాద్, జనసేన నాయకులు శివప్రసాద్, శ్రీరామ్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

- నివాళులర్పించిన రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న మధురవాణి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఒంగోలులో వివిధ రాజకీయ పార్టీలు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళు లర్పించారు.

- స్థానిక హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, నగర కన్వీనర్ కఠారి శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతర వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బాలినేని, అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

- సీఐటీయూ, మునిసిపల్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో నాయకులు తంబి శ్రీనివాసులు, కె.శ్రీనివాసరావు, సీహెచ్.అక్కేశ్వరరావు, రామారావు, ఎద్దు రవికుమార్, బి.అరుణ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

- బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ధరణికోట లక్ష్మీనారాయణ, ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి తాటిపర్తి వెంకటస్వామి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

- యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ, వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పి.చిరంజీవి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ నాగభూషణ్, రీజనల్ సెక్రటరీ భాస్కర్‌బాబు, జాతీయ ఉపాధ్యక్షుడు రాజేష్ ఖల్ల, రత్నం పాల్గొన్నారు.

- నీలంపాలెంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రరావు, ఏలూరి శ్రీనివాసరావు, దారా అంజయ్య, కాకుమాను రవి, ముత్తన పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

- బీటీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, జైభీమ్ నాగేశ్వరరావు, టి.సుమతి, తిరుపతి కిషోర్, ఎం.హర్షప్రీతమ్, నాగేంద్రవదన్, మద్దిరాల శరత్‌చంద్రబాబు, పాలేటి సువర్ణబాబు, ఆర్.కోటేశ్వరరావు, పల్లె కృష్ణమూర్తి, సుబ్బారావు, వెలుగొండయ్య, కృపాజయం, చెక్క కోటేశ్వరరాఎవు, రాజేంద్రప్రసాద్, బొంత కల్యాణ్ పాల్గొన్నారు.

- స్థానిక ఎల్‌బీజీభవన్‌లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ప్రజాసంఘాల నాయకులు బి.రఘురాం, పమిడి వెంకట్రావు, సీహెచ్.జయప్రకాష్, కంకణాల ఆంజనేయులు, సీహెచ్.వినోద్, కేఎఫ్‌బాబు, తిరుపతిరావు, కంకణాల రమాదేవి, ఆట్లూరి రాఘవులు, వెంకటేష్, చీకటి శ్రీనివాసరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- వికాస్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 150 మంది విద్యార్థులకు ఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అధ్యక్షతన డీఈవో సుభద్ర, ఏపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్‌వలి, కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ మోహనరావు, వీరయ్య మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో నవదీప్, సంతోష్, అభిరామ్, దానియేలు, సోమనాథ్, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

పలు సంఘాల ఆధ్వర్యంలో..

- స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. బీరం అరుణ, తేళ్ల అరుణ, సీహెచ్.కనకదుర్గ, గుంటుపల్లి శ్రీదేవి, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

- దేవుడుచెరువులోని వేదిక ఫౌండేషన్ కార్యాలయంలో విశ్రాంత వాణిజ్యపన్నుల శాఖాధికారి ఆర్.సదానందరావు, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు షేక్ సిద్దాంబి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మారేపల్లి సూర్యకుమారి, పి.శివ, అంగలకుర్తి ప్రసాదు, గోను లీలారాణి, పి.శ్రావ్యరెడ్డి పాల్గొన్నారు.

-స్థానిక కుమార్ రెసిడెన్సీలో జరిగిన సంగీత సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన గాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నిర్వాహకులు అర్జున్ కర్నాటి, జనార్దనరావు, తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ వీకెండ్ కామెంట్ ఫేమ్ మధురవాణి పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గాయకులు వంశీమోహన్, సైదారెడ్డి, డాక్టర్ మల్లిఖార్జునరావు, మాగంటి శ్రీనివాసమూర్తి, కోటి ఆర్ఫ్, కొండారెడ్డి, రామస్వామి, హరిబాబు, పి.శ్యామ్యరెడ్డి, ఎ.లక్ష్మీప్రసన్న, లక్ష్మీప్రియ, శ్యామల, సత్యస్వాతి, రాధానాయుడు, ఆషా, విజయ, సుమాంజలి, సౌజన్య పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

ఒంగోలు(కార్పొరేషన్): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక హెచ్‌సీఎం కాలేజీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు.

- ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఉమా మనో వికాస కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన పలు పరికరాలు అందించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, నాయకులు ఎం.సునీల్, డీజీఎస్.ప్రదీప్, దుగ్గిరాల కార్తీక్, ఏజీఎస్ కిరణ్, బాలాంజనేయులు, సుధాకర్, డీఆర్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

- ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రిచర్ఫ్, సుధాకర్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో..

మద్దిపాడు: మండలంలోని మద్దిపాడులో అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి మేరుగ నాగార్జున పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ వాకా అరుణ, కోటిరెడ్డి, మండల అప్పారావు, విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక దళితవాడలో మాజీ సర్పంచ్ జజ్జర శరత్‌బాబు నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి వెంకటరమణ అంబేడ్కర్ విగ్రహానికి పాలఅభిషేకం చేశారు. కార్యక్రమంలో సిరివెళ్ల యోహాను, పొన్నం ఆంజనేయులు పాల్గొన్నారు. వెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాలపర్తి విజయేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు, సర్పంచ్ చిట్టిబోయిన అనిల్, పులిపాటి రాఘవులు నివాళుల్పరించారు. ఏడుగుండ్లపాడు సర్పంచ్ దాసరి శిల్ప సౌందర్య అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

నాగులుప్పలపాడు: అంబేడ్కర్ జయంతిని ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ రోడ్డులో జగజ్జీవనరామ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎవరెస్ట్ అధిరోహితుడు కాకుమాను రాజశిఖామణి పాల్గొని అంబేడ్కర్, జగజ్జీవనరామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పండిటి వీరాస్వామి, జిల్లా కోర్టు సూపరింటెండెంట్ శిఖా సంధ్యాసుందర్, శేషయ్య మాస్టారు, కాలకలూరి సురేష్, బత్తిన వంశీకృష్ణ, తమ్ములూరి చిట్టిబాబు, కోటేశ్వరరావు, ప్రవీణ్, నిఖిల్, కాలకలూరి విజయ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రక్తదానం

ఒమ్మెవరం గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం నిర్వహించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా యూత్ ముందుగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది యువకులు రక్తదానం చేసి రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు.

సంతనూతలపాడు: సంతనూతలపాడు అంబేడ్కర్‌భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి ఆర్.అంకారావు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఎమ్.ఫణీంద్ర, యోగి, నరసయ్య కొండలు, బుజ్జిబాబు, బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో యువత అంబేడ్కర్ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద అంబేడ్కర్ జీవిత చరిత్ర సినిమాను ప్రదర్శించారు. అలాగే అంబేడ్కర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి, వైసీపీ అభ్యర్థి మేరుగ నాగార్జున, ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మలు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.రాగమ్మ, సర్పంచ్ డి.నాగమణి, డి.చెంచిరెడ్డి, యలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రిమ్స్‌లో నివాళులర్పిస్తున్న వైద్యులు



ఒమ్మెవరంలో రక్తదానం చేస్తున్న యువత



మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

అవీ..ఇవీ..

నేటి నుంచి ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ : ఆర్ఐవో

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 14 : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతూ ఫెయిలైన విద్యార్థులకు ఈనెల 15వ తేదీ నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని బోర్డు ఆర్ఐవో సైమన్ విక్టర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల ఫలితాలు ఘోరంగా ఉన్నాయని ఇంటర్ విద్యా కమిషనర్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు పాసయ్యేలా వారికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ప్రభుత్వ కళాశాలల ప్రధానాచార్యులు, అధ్యాపకులు సమష్టి ప్రణాళికలు రూపొందించి ఫెయిలైన విద్యార్థులకు కళాశాలలకు రప్పించి ప్రత్యేకత తరగతులు నిర్వహించాలని సైమన్‌విక్టర్ కోరారు. కాగా తరగతుల నిర్వహణ విషయంలో ఎవరైనా అలసత్వం ప్రదర్శించినా, ఇతర కారణాలు తెలియజేసినా అటువంటి వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కేజీబీవీల్లో.. జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ జూనియర్ కళాశాలలు, ఏపీ మోడల్ స్కూళ్ళు, హైస్కూలు ప్లస్ మహిళా జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారో గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ఉమ్మడి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఫెయిలైన విద్యార్థులందరూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు.

సిఫార్సు బదిలీ ఉత్తర్వులు అమలు ఆలస్యం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 14: రాజకీయ నాయకుల సిఫార్సులతో ప్రభుత్వం నుంచి పొందిన బదిలీ ఉత్తర్వులు అమలు మరింత ఆలస్యంకానుంది. జిల్లాలో సుమారు 80మంది ఉపాధ్యాయులు ప్రభుత్వ బదిలీ ఉత్తర్వులు పొందారు. ఆ ఉత్తర్వుల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం 2023-24 ముగిశాక ఏప్రిల్ 30న ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ అయ్యి మే 1న బదిలీ పొందిన కొత్త పాఠశాలో చేరాలని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలులో ఉంది. మే 13న రాష్ట్రంలో పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్లలెక్కింపు జరుగుతుంది. ఆ తరువాత ఎన్నికల కోడ్ ముగుస్తుంది. కోడ్ ముగిశాక ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులు ఏ మేరకు వీరు పాఠశాలల నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుంది. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

బహుజన-గిరిజన రాష్ట్ర ఐక్యవేదిక ఆవిర్భావం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 14: బహుజన- గిరిజన రాష్ట్ర ఐక్యవేదిక ఆవిర్భావం ఏర్పాటైంది. ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులోని రాజీవ్‌గృహ కల్పనకాలనీలో గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన ఐక్యవేదికను ఇక నుంచి బహుజన, గిరిజన ఐక్యవేదికగా కొనసాగించాలని నిర్ణయించారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, ప్రతినిధులు ఎస్‌కే.వలి, జగన్నాథం దేవదాస్, బుజ్జి, కోటి, గుర్రం వరలక్ష్మి, వాణి, లింగం, వెంకట్రావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

16న శ్లాస్ పరీక్ష : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 14: క్షేత్ర స్థాయిలో విద్యార్థుల నైపుణ్యాలను తెలుసుకునేందుకు ఈనెల 16న శ్లాస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఆదివారం శ్లాస్ పరీక్ష నిర్వహణపై సీఆర్పీలకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శ్లాస్ ఫలితాలు విద్యార్థులకు పాఠ్యాంశాలు నిర్ణయించడంలో దోహదపడుతాయని తెలిపారు. జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి వై.వెంకట్రావు మాట్లాడుతూ శ్లాస్ పరీక్ష జిల్లాలోని 123 పాఠశాలల్లో 3,845 మంది విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణకు 123 మంది ఫీల్డ్ ఇన్విజిలేటర్లకు ఒక రోజు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తెలుగు, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తారు. విద్యార్థులకు ఉదయం 9నుంచి 10.30 గంటల వరకు మొదటి పరీక్ష, అలాగే 10.40నుంచి 12.15 వరకు రెండవ పరీక్ష జరుగుతుంది. కార్యక్రమంలో ఎంఈవో కిషోర్‌బాబు, ఏఎంవో రమేష్, డైట్ అధ్యాపకులు ఎం.రవీంద్రప్రసాద్, రఘుబాబు, కె.రాము పాల్గొన్నారు.

రైజ్‌లో ఘనంగా వీడ్కోలు వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 14: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌లో ఆదివారం సీఎస్ఈ, ఎంసీఏ విభాగాల విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాలల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన గౌరవ ఛైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా కష్టపడి కృషి చేసి ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు మాట్లాడుతూ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 70శాతం మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విభాగాధిపతులు కె.నారాయణరావు, ఏవీ.రమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



దెబ్బతిన్న ఆటోను పరిశీలిస్తున్న సీఐ, మృతి చెందిన బాలకృష్ణ (ఫైల్)

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 14: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఒంగోలు సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. ఒంగోలు మండలం చెరువుకొమ్ము పాలెం గ్రామానికి చెందిన చిట్నేని బాలక్రిష్ణ(35) తన ఆటోలో ఓ పత్రికకు చెందిన న్యూస్‌పేపర్‌ను రవాణా చేస్తుంటాడు. శనివారం అర్థరాత్రి దాటిన తరువాత ఇంటి వద్ద నుంచి ఆటోలో న్యూస్‌పేపర్ కార్యాలయానికి బయలుదేరాడు. అయితే అగ్రహారం సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ముందుగా వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఒక్కసారిగా నెమ్మదించడంతో ఆటో ఢీకొంది. అయితే ఆ వాహనం సంఘటనా ప్రదేశం నుంచి వెళ్ళిపోయింది. ఆటో నుజ్జునుజ్జు కాగా వాహనం నడుపుతున్న బాలక్రిష్ణ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్సై పున్నారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 14: అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా అగ్నిమాపకశాఖ సహాయ అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలులోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రజలను చైతన్య పరిచేందుకు అనేక కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. జిల్లాలోని 10 కేంద్రాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం

మద్దిపాడు, ఏప్రిల్ 14: గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో పడవలు, మరబోట్ల ద్వారా నిర్వహించే చేపల వేటను 61 రోజులపాటు నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో చేపలు సంతానోత్పత్తి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలు అధిగమిస్తే మత్స్యకారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ రాయితీలు సైతం నిలిపివేస్తామన్నారు. తిరిగి చేపల వేట ఎప్పుడు ప్రారంభించే తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు.

వైసీపీని చిత్తుగా ఓడించాలి

సంతనూతలపాడు, ఏప్రిల్ 14: రాష్ట్ర ప్రజలను దోచుకుతింటున్న వైసీపీ పాలకులను త్వరలో జరిగే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు మాధవి పిలుపునిచ్చారు. ఆదివారం మైనంపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, అడకా స్వాములు, అంకారావు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



కొండపిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

కొండపి, ఏప్రిల్ 14 : కొండపిలోని ప్రధానమైన ఆర్అండ్‌బీ రోడ్డుకు రెండు వైపులా ఉన్న దుకాణాలు, ఆర్యవైశ్య బజార్‌లో బాబు ష్యూరిటీ ప్రచార కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పాదర్తి సుధాకర్, అద్దేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను అందజేశారు. సూపర్ సిక్స్ పథకాలను స్థానికులకు వివరించారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, డ్వాక్రా మహిళలకు రుణాలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ కొండపి పట్టణ నాయకులు నన్నూరి సుబ్బరామయ్య, కందిమళ్ల రమేష్, మునునూరి వెంకటేశ్వర్లు, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాఊషా, ఆర్యవైశ్యసంఘం నాయకులు చలువాది రాధాకృష్ణమూర్తి, వంశీకృష్ణ, హరేరాం తదితరులు పాల్గొన్నారు.



తూర్పునాయుడుపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

టీడీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

టంగుటూరు, ఏప్రిల్ 14 : మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను టంగుటూరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్‌నగర్ ముఖద్వారం వద్ద నున్న అంబేడ్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుండి అరుంధతీనగర్ చేరుకొని అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అలాగే బుచ్చిరాజుపాలెం, బాపూజీ కాలనీ లోగల అంబేడ్కర్ విగ్రహాలకూ నివాళులర్పించారు. బస్టాండ్ సెంటర వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈకార్యక్రమాల్లో నేతలు కామని విజయకుమార్, బెల్లం జయంత్‌బాబు, చదలవాడ చంద్రశేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడు బెల్లం కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బ్రహ్మానందం పాల్గొన్నారు. టంగుటూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలల్లో సర్పంచ్ మద్దిరాల మమత పూలమాల వేసి నివాళులర్పించారు.

తూర్పునాయుడుపాలెంలో...

మండలంలోని తూర్పునాయుడుపాలెంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా ఆయన తన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు.

హక్కుల ప్రదాత అంబేడ్కర్

భారతదేశ ప్రజల హక్కుల ప్రదాత బాబా సాహెబ్ అంబేడ్కర్ అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చెప్పారు. టంగుటూరులో అంబేడ్కర్ జయంతి ఆదివారం వైసీపీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. తొలుత సురేష్ బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు బొడ్డు సతీష్ నాయకత్వం వహించారు.

కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో

కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యాన టంగుటూరులో ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు సంఘాల నాయకులు బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నియోజకవర్గ కార్యదర్శి మోజెస్, నాయకుడు నూకతోటి పేరయ్య, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

సింగరాయకొండ : దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, వారి ఆశయాల సాధనకు టీడీపీ కృషిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని పాకల అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన అంబేడ్కర్ 133వ జయంతి వేడుకల్లో స్వామి కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైకం చంద్రశేఖర్, చీమకుర్తి కృష్ణ, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు. దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, వారి ఆశయాల సాధనకు టీడీపీ కృషిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని పాకల అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన అంబేడ్కర్ 133వ జయంతి వేడుకల్లో స్వామి కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైకం చంద్రశేఖర్, చీమకుర్తి కృష్ణ, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్, మాగుంట రాఘవరెడ్డి, నారపుశెట్టి పాపారావు తదితరులు

టీడీపీ హయాంలోనే ఆర్యవైశ్యుల అభ్యున్నతి

దర్శి, ఏప్రిల్ 14: టీడీపీ హయాంలోనే ఆర్యవైశ్యులకు అన్నిరకాలుగా ప్రాధాన్యం కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేయటం జరిగిందని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టి పాటి లక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనివాస పద్మావతి కల్యాణ మండపంలో జరి గిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆర్యవైశ్యులకు ఎన్నో ఉన్నత పదవులు కట్టబెట్టి గౌరవించారన్నారు. జిల్లాలోని పలువురు ఆర్యవైశ్య నాయకులు జాతీయ, రాష్ట్రస్థాయిలో కీలక పదవులు నిర్వహించిన విషయం తెలిసిందేనని అన్నారు. భవిష్యత్తులో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించటం జరుగుతుందని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉం టామని చెప్పారు.

కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు సూరె సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మాగుంట రాఘవరెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఒగ్గు పవన్‌కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అచ్చుత గురువార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి నానా అగచాట్లు

పాతసింగరాయకొండలో ప్రజల ఇక్కట్లు
రెండేళ్లుగా మూతపడిన వాటర్‌ప్లాంట్‌లు
పట్టించుకోని పాలకులు

సింగరాయకొండ, ఏప్రిల్ 14 : మండలంలో ప్రధాన గ్రామమైన పాతసింగరాయకొండతో పాటు ఆ పంచాయతీ పరిధిలోని ఎస్సీకాలనీలో రెండేళ్లుగా వాటర్‌ప్లాంట్‌లు మూతపడినా పట్టించుకున్న దిక్కులేరు. దీంతో అక్కడి ప్రజలు బిందెడు నీరు సరిగా అందక ఇక్కట్లు పడుతున్నారు. వివరాలలోకి వెళ్తే.. పాతసింగరాయకొండ గ్రామంలో టీడీపీ హయాంలో స్థానిక జీవీఆర్ ఫ్యాక్టరీ ఆర్థిక సహాయం, పంచాయతీ నిధులు కొంత వెచ్చించి అప్పటి సర్పంచ్ గాలి బొల్లయ్య దాదాపు రూ.10 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్‌ను నిర్మించారు. టీడీపీ ప్రభుత్వంలో సజావుగా ప్లాంట్‌ను నిర్వహించారు. కేవలం రూ.5లకే 25 లీటర్ల సురక్షిత నీటిని అందజేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అధికారులు, వైసీపీ పాలకులు ప్లాంట్ నిర్వహణను గాలికి వదలివేశారు. వారి ఐదేళ్ల హయాంలో ప్లాంట్ పలుమార్లు మూతపడింది. దాదాపు రెండేళ్ల నుంచి పూర్తిగా మూతబడిన ప్లాంటు కళ్లెదురు కనిపిస్తున్నా దానివైపు కన్నెత్తి చూసిన నాథుడు లేడు. అలాగే ఎస్సీ కాలనీలోని వాటర్ ప్లాంట్ కూడా మరమ్మతుల పాలైంది. 500 గడపల పైన ఉండే రెండు ఎస్సీకాలనీల్లోని ప్రజలు నీటి కోసం నానాఅగచాట్లు పడుతున్నారు. దాదాపు రెండు కిలోమీటర్లు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకుల అసమర్థత, అధికారుల అలక్ష్యంతోనే తాగునీటికి అగచాట్లు దాపురించాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పాతసింగరాయకొండలో మూతపడ్డ వాటర్‌ప్లాంట్

ఎస్సీకాలనీలో నాలుగు రోజులకు ఒకమారు నీరు

గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీలకు నీటి సమస్య చాలా ఏళ్ల నుంచి వేధిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో రూ.10 లక్షలతో కాలనీలకు పైపులైన్ వేయించి నీటి సౌకర్యాన్ని కల్పించారు. టీడీపీ ప్రభుత్వంలో రెండు కాలనీలకు రోజుమార్చిరోజు నీటిని విడుదల చేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నాలుగైదు రోజులకు ఒకమారు మాత్రమే అదికూడా చాలీచాలకుండా ఇస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామతీర్థం ప్రాజెక్ట్ డిజైన్‌లో ఉన్న నిర్లక్ష్యం

పాతసింగరాయకొండలోని రెండు ఎస్సీకాలనీలు, ఎస్టీ కాలనీ(తాతయ్యకాలనీ)కి రామతీర్థం ప్రాజెక్టు డిజైన్ ప్రకారం నీటిని అందించాల్సి ఉంది. టీడీపీ హయాంలో రామతీర్థం నీటికి పాతసింగరాయకొండ ప్రధాన గ్రామం వరకూ పైపులైన్ నిర్మించారు. నాడు పైపులైన్ నిర్మాణానికి నిధుల కొరత ఏర్పడటంతో పంచాయతీ నిధులు నుంచి పనిని పూర్తి చేద్దామని అప్పటి పాలకులు భావించారు. ఈ తరుణంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులకు బ్రేక్ పడ్డాయి. ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ కాలనీలకు తాగునీటి అందించే ప్రయత్నాలపై అధికారపార్టీ నాయకులు దృష్టి సారించలేదు. దీంతో వారికి నీటి ఇక్కట్లు తప్పడం లేదు.

కందులూరులో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ

- **ఆ గ్రామం నుంచి వరుస బెట్టి వలసలు**
- **తాజాగా టీడీపీలో చేరిన 50 కుటుంబాలు**

టంగుటూరు, ఏప్రిల్ 14 : ఇంత కాలం వైసీపీకి బలమైన ఓటు బ్యాంక్ కేంద్రంగా గుర్తింపు పొందిన మండలంలోని కందులూరులో ఆ పార్టీకి బీటలు పడుతున్నాయి. గత వారంలో వైసీపీ నుంచి 25 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకోగా తాజాగా ఆదివారం మరో 50 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే గృహంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీరందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దగా పడ్డ దళితులు ఇప్పుడిప్పుడే ఆలోచించి వైసీపీని వీడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయింది ఎస్సీ సామాజిక వర్గమేనని, అది ఎంతో లోతుగా ఆలోచిస్తేనే అర్థమవుతోందని చెప్పారు. ఈవిషయాలన్నీ వారికి క్రమంగా బోధపడుతుండడంతో ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేయగానే వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 27 సంక్షేమ పథకాలను తిరిగి ప్రవేశ పెట్టనున్నట్లు చెప్పారు. దళితుని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని తన చంకలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్ తిరుగుతున్నాడని, దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిని చేసి చంపేశారని, ఆయనకు ఎస్సీలపై ఉన్న ప్రేమ ఈ సంఘటనలతో తేటతెల్లమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్‌నేత బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన 50 కుటుంబాలతో ఎమ్మెల్యే, టీడీపీ మండల నాయకులు



సింగరాయకొండలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ : మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ వైసీపీకి చెందిన 5 కుటుంబాల వారు ఆ పార్టీని వీడారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. వారికి కండువాలు కప్పి స్వామి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అలహరి బాలాజి, సుబ్బారావు, శీలం లక్ష్మి, వెంకట్రావు, గుండ్రెడ్డి శివప్రసాద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు శీలం చంటి, బొడ్డు బాలకోటయ్య పాల్గొన్నారు.

కొండపిలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కొండపి : కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలేనికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. కట్టావారిపాలేనికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుంచాల ప్రసాద్, ఆ పార్టీ యువకులు తన్నీరు హరికృష్ణ, తన్నీరు లక్ష్మయ్య మరో పది కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా స్వామి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కట్టావారిపాలెం టీడీపీ నాయకులు రావెళ్ల వెంకటరఘునాథ్‌బాబు, అనుమాల ప్రసాద్ పాల్గొన్నారు.



కొండపిలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్, వైసీపీ నాయకులు

టీడీపీ గూటికి 5 కుటుంబాలు

- **ఎమ్మెల్యే స్వామి సమక్షంలో చేరిక**



ఊళ్లపాలెంలో కుట్టుమిషన్ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న రాఘవరెడ్డి సతీమణి చందన

మాగుంట, స్వామిలను గెలిపించండి

- **రాఘవరెడ్డి సతీమణి చందన**

సింగరాయకొండ, ఏప్రిల్ 14 : టీడీపీ తరఫున ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాగుంట శ్రీనివాసులరెడ్డిని, కొండపి ఎమ్మెల్యేగా బరిలో ఉన్న డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని గెలిపించాలని మాగుంట రాఘవ సతీమణి చందన కోరారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధి ఫకీర్ పాలెం, ఊళ్లపాలెంలో మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రాలను ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న మహిళలతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యన్నాబత్తిన మురళి, పాకనాటి సుబ్బారెడ్డి, షేక్ నాసీర్, కోటిరెడ్డి, షేక్ మున్నా పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రయోజనాలకే సూపర్ సిక్స్ పథకాలు

టంగుటూరు, ఏప్రిల్ 14 : రానున్న ఎన్నికల్లో విజయం సాధించి ఏర్పాటు చేసే తెలుగుదేశం ప్రభుత్వం అన్ని వర్గాల ప్రయోజనాల కోసం సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. టీడీపీ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక బుచ్చిరాజుపాలెంలో ఇంటింటి ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి మహిళకు రూ.1,500 ప్రతి నెలా అందిస్తాం అని, ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా సరఫరా చేస్తామని, ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తామని, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15వేలు అందిస్తామని, ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఈ నిధులు అందేలా చూస్తామని చెప్పారు. నిరుద్యోగ యువతకు భృతి నెలకు రూ.3వేలు చెల్లించనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు గుర్తింపు

ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 14 : బీసీల ఆత్మ గౌరవానికి విలువనిచ్చే తెలుగుదేశం పార్టీలోకి రావాలని బీసీ కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మార్టూరులో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. బీసీ రాష్ట్ర నాయకుడు గుంజి వెంకట్రావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఏలూరి మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత బీసీలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేసి, అండగా ఉంటామన్నారు. జగన్‌రెడ్డిపై రాయి దాడి కుట్రలో భాగమన్నారు. నాడు కోడి కత్తి.. నేడు రాయి డ్రామాతో మరో అమాయకుడిని బలిపశువును చేసేందుకు వ్యూహం పన్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కోసం పాటు పడే ప్ర భుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. గౌరవం లేని చోట ఉండవద్దన్నారు. ప్రజల ఆత్మ గౌరవానికి విలువ నిచ్చే చంద్రబా బు పాలనకు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. పర్చూరు నియోజక వర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులకు మీరిచ్చే విజయంతో దుర్మార్గ పాలన అంతం కావాలన్నారు. కార్యక్రమంలో గుంజి వెంకట్రావు, శివరాత్రి శ్రీను, పోలూరి సింగయ్య, ఉప్పు గురవయ్య, పల్లపు అంకమ్మ రావు, మండల నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్, తాటి నాగేశ్వరావు, మహిళా నేతలు రమాదేవి, రాధ పాల్గొన్నారు.



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏలూరి

టీడీపీలో చేరికల జోష్

చినగంజాం : చినగంజాం మండలంలో టీడీపీలో చేరికలు జోష్‌గా కొనసాగుతున్నాయి. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని వైసీపీకి చెందిన వార్డు మెంబర్లు, మసీదుపేట, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ వార్డు మెంబరు షేక్ నబీషా ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు గేరా ఆషా, మార్పు సుకుమార్, మసీదుపేట, అంబేడ్కర్‌నగర్‌లకు చెందిన 40 కుటుంబాలకు చెందిన ముస్లింలు, ఎస్సీలు పార్టీలో చేరగా ఎమ్మెల్యే ఏలూరి వారికి కండువాలు వేసి ఆహ్వానించారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎన్‌డీఏ కూటమి గెలుపే లక్ష్యం

- **ఎమ్మార్పీఎస్ నాయకులు**
- **వైసీపీ ఓటమికి మాదిగల కంకణం**
- **అంబేడ్కర్‌కు ఘన నివాళులు**

కొండపి, ఏప్రిల్ 14 : ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా, వైసీపీ అభ్యర్థుల ఓటమికి ఎమ్మార్పీఎస్ కంకణం కట్టుకుని పనిచేస్తోందని ఎమ్మార్పీఎస్ నాయకులు చెప్పారు. కొండపిలోని కామేపల్లి రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తొరటి ఆనంద్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ప్రధాని నరేంద్రమోదీ కట్టుబడి ఉన్నారన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వర్గీకరణ సమంజసమని, మాదిగలకు అండగా నిలిచారని చెప్పారు. మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగలు ఎన్‌డీఏకు పూర్తి మద్దతు ఇస్తున్నామన్నారు. ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి మాదిగలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్ మాదిగలకు హామీనిచ్చి, వర్గీకరణకు అడ్డుపడే శక్తులకు అండగా నిలిచాడని విమర్శించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా పోటీచేస్తున్న అభ్యర్థులతోపాటు, ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తున్న కూటమి టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి విజయానికి కృషి చేస్తామని చెప్పారు. కొండపి నియోజకవర్గ ఎమ్మెస్పీ ఇన్‌చార్జి పూనూరి క్రిస్టఫర్ మాదిగ మాట్లాడుతూ నియోజవకర్గంలో కూటమి బలపరుస్తున్న టీడీపీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి ఎమ్మార్పీఎస్ అండగా నిలుస్తోందన్నారు. సమావేశంలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఎం. రాజారామ్, పులి వెంకటేశ్వర్లు, పంది ప్రభుదాస్, మోయిడీ బసవయ్య, తలారి కోటేశ్వరరావు, పేముల జగన్ మాదిగ, ఇజ్రాయిల్, మన్నం రాజేష్, జైకుమార్, సంజీవ్, గురిజాల బాబూరావు, కాములూరి గోవర్ధన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశీర్వాద స్వీకరణలో సుజాత

టంగుటూరు, ఏప్రిల్ 14 :రానున్న అసెంబ్లీ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధపడ్డ విఘ్నం సుజాత ఆదివారం డాక్టర్ అంబేడ్కర్ ఆశీర్వాదం స్వీకరించారు. ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటేందుకు ఈఎన్నికలను అవకాశంగా భావిస్తున్నారు. తన ఉద్యోగం పీకివేత నుంచి నిందితులను కాపాడే వరకు కృషి చేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్‌పై పోరాటానికే పోటీకి దిగానని ఆమె చెప్పారు. అంబేడ్కర్‌నగర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఉదయం ఆమె ఆశీర్వాదం స్వీకరించారు.

నేడు పాకలలో టీడీపీ బీసీల ఆత్మీయ సమావేశం

సింగరాయకొండ, ఏప్రిల్ 14 : మండలంలోని పాకల తీరంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు టీడీపీ నియోజకవర్గ బీసీల ఆత్మీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్రయాదవ్, ఎమ్మెల్సీ రామారావు, వడ్డెర సంఘ నేత వడ్డె వెంకట్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు బాలాజీ హాజరవుతారని వివరించారు. నియోజకవర్గంలో బీసీ కులాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గిరిజన ద్రోహి జగన్

టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్

అడుసుమల్లి(పర్చూరు), ఏప్రిల్ 14: గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు దారు నాయక్ అన్నారు. పర్చూరు మండలం అడుసుమల్లి, భూషాయపాలెం గ్రామాల్లోని తాండాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి తాండా వాసులను సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమాన్ని జగన్‌రెడ్డి విస్మరించారన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ నాయకుడు ఇండ్ల శ్రీనివాసరావు, పర్చూరు నియోజకవర్గ నాయకులు పాలపర్తి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కారుమంచి కృష్ణ, మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్ బాబు పాల్గొన్నారు.

బీసీలపై పెరిగిన దాడులు

ఎమ్మెల్యే గొట్టిపాటి

సంతమాగులూరు, ఏప్రిల్ 14 : వైసీపీ రాక్షస పాలనలో బీసీపై దాడులు పెరిగాయని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. సంతమాగులూరు మండలంలోని పరిటాలవారిపాలెం గ్రామంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన 30 కుటుంబాలకు చెందిన పుట్టా రామాంజీ, గుంటూరు హనుమంతరావు గుంటూరు రవి, చెవుల చంద్రయ్య, పాత కోట రమజాన్, యేసు దానం, నూకల అంకమ్మరావు, చిలువేరి వేంకటేశ్వర్లు వైసీపీని వీడి ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీ చేరారు.



మన్నెంవారిపల్లిలో కూటమి నాయకుల ఎన్నికల ప్రచారం

టీడీపీతోనే మార్కాపురం అభివృద్ధి

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ● నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి భారీగా మద్దతు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 14: ఎన్డీఏ కూటమి గెలుపుతోనే మార్కాపురం జిల్లా సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెదయాచవరం, మొద్దులపల్లి, నాయుడు పల్లి, మన్నవారిపల్లి, బోడపాడు, రాజుపాలెం, పెద నాగులవరం, నికరంపల్లె గ్రామాలలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఆయనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. వైసీపీకి ఓటు వేస్తే అరాచకానికి మద్దతు పలికినట్టేనన్నారు. అదే టీడీపీకి ఓటు వేస్తే ఒక ఓటుతో రెండు ప్రయోజనాలు ఉంటాయన్నారు. మార్కాపురంను ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని త్వరితగతిన అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. అదే విధంగా వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతులను రారాజులను చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలిపి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

టీడీపీతోనే మహిళా సాధికారత

మార్కాపురం : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వంలోనే మహిళా సాధికారత సాధ్యమని ఆ పార్టీ నాయకురాళ్లు మాగుంట చందన, కందుల వసంతలక్ష్మిలు అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో ఆదివారం మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందన, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మిలు ఇంటింటికి 'మన కందుల' ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడుతోనే ఏపీలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తల్లికి వందనం పథకంలో భాగంగా ఒక ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు అందించనున్నట్లు తెలిపారు. దీపం పేరుతో ఏడాదికి మూడు ఉచిత సిలెండర్లు అందజేస్తామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితం ప్రయాణం, ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపర్చిన అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, జనసేన నాయకులు సయ్యద్ సాధిక్, నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మాగుంట చందన, కందుల వసంతలక్ష్మి

ఇంటింటి ప్రచారంలో విఘ్నేష్

కొనకనమిట్ల : మండలంలోని గనివినిపాడు గ్రామంలో ఆదివారం ఇంటింటి ప్రచార కార్యక్రమం కందుల నారాయణరెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి, సోదరుడి తనయుడు రోహిత్‌రెడ్డిలు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్డీఏ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి, కందుల నారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. రోహిత్‌రెడ్డి, విఘ్నేష్‌రెడ్డిలకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో కలిసి విజయకేతనం చూపుతున్న నారాయణరెడ్డి

30 దళిత కుటుంబాల చేరిక

తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు ఎస్సీ కాలనీలో 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముండ్లపాటి పెద్ద వెంకటయ్య, ముండ్లపాటి విజయ్, ముండ్లపాటి కృప, ముండ్లపాటి వెంకటయ్య, ముండ్లపాటి చిన్నయ్య, సుబ్బమ్మ, అనూష, కందుల కృపయ్య, డోలా నరసమ్మలతో పాటు మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ. వైసీపీ ప్రభుత్వం దళిత పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. తనను, మాగుంట శ్రీనివాసులు రెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.ఏసుదాసు, టీడీపీ మండల అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, నరసింహులు, యక్కంటి వెంకటరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి, నాలి బాలయ్య, అచ్చిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20 కుటుంబాల చేరిక

పొదిలి : మండలంలోని ఈగలపాడు గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు ఆదివారం కందుల నారాయణరరెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డి సన్నిహితుడు బెజవాడ సురేష్ సమక్షంలో టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారిలో నుగ్గు చిన్నవెంకటేశ్వర్లు, పెద్దవెకటేశ్వర్లు, నుగ్గు ఆంజనేయులు, నుగ్గు సంగమయ్య, నుగ్గు ఎర్రయ్య, గుండు ఆంజనేయులు, నుగ్గు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు కనకం ఆంజనేయులు, కొమ్మి రమేష్, నులక ఏడుకొండలుతోపాటు సుమారుగా 20 కుటుంబా లకు చెందిన వారు ఉన్నారు. వీరికి విఘ్నేష్‌రెడ్డి పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పార్టీ గెలుపు కోసం పనిచేయాలని విఘ్నేష్‌రెడ్డి కోరారు.

అవీ.. ఇవీ..

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎరిక్షన్‌బాబు

● టీడీపీలో పలు కుటుంబాల చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 14 : రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని, రాష్ట్రాభివృద్ధితో పాటు తాము కార్యకర్తలకు అండగా ఉంటామని ఎర్రగొండపాలెం అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం పుల్లలచెరువుకు చెందిన సర్పంచి బడిపాటి ఓబులు, ఎంపీటీసీ కోటకొండ రాధాకృష్ణ ఆధ్వర్యంలో మండలానికి చెందిన రావూరి శేషయ్య, బడిపాటి జయలక్ష్మీ, జమ్మలపూడి ఏసుబాబు తదితర 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఆ క్రమంలోనే దోర్నాల మండలం జమ్మిదోర్నాలకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు బత్తినేని చిన్న వెంకటేశ్వర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గూడూరి మాట్లాడారు ప్రజాసంక్షేమం, అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా అత్యధిక మెజార్టీతో టీడీపీని గెలిపించు కుంటే రాక్షస పాలన అంతమవుతుందన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని, ఓటుగా మల్చుకోవాలసిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, ఎలకపాటి చంచయ్య, షేక్ భాష, ఇస్మాయిల్, చల్లా వెంకటేశ్వర్లు, కె శ్రీనివాసులు, కె రాజేంద్ర, కె సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాషనాగెళ్ల సత్యనారాయణ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

17న పట్టాభిషేకం

గిద్దలూరు, ఏప్రిల్ 14 : పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న సాయంత్రం 4 గంటలకు శ్రీసీతారామలక్ష్మణ స్వాముల వారికి పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పాత బద్వేల్ రోడ్డులోని రామాలయంలో 17న రాత్రి 7.25 గంటలకు శ్రీసీతారామస్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవ స్థాన కమిటీ అధ్యక్షులు విఠా సుబ్బరత్నం, కార్యదర్శి శివపురం వెంకటరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 14: మార్కాపురం పట్టణ శివారులలో వెలసియున్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

గిద్దలూరు, ఏప్రిల్ 14 : కాంగ్రెస్ అభ్యర్థి పగడాల పెద్దరంగస్వామి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని, ఫించన్ పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆవులయ్య కాంగ్రెస్ నాయకులు నాగరాజు, జమాల్‌సాహెబ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురి మధ్య ఘర్షణ - ఒకరికి తీవ్ర గాయాలు

పొదిలి, ఏప్రిల్ 14 : పట్టణంలోని టైలర్స్‌కాలనీలో ఇరువురు ఘర్షణ పడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ట్రైలర్స్‌కాలనీకి చెందిన లతీఫ్, ఖాదర్‌బాషాలకు మధ్య చేపల మార్కెట్ వద్ద చిన్నపాటి వాదులాట చోటుచేసుకొంది. ఆ గొడవలో లతీఫ్‌ను ఖాదర్‌బాష పక్కనే ఉన్న కర్రతో తలపై కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం ఒంగోలు తరలించారు. లతీఫ్ భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

అశోక్‌రెడ్డి గెలుపుతో నియోజకవర్గ అభివృద్ధి

● ముత్తుముల సోదరి గీత



ప్రచారం నిర్వహిస్తున్న ముత్తుముల గీత

బేస్తవారపేట, ఏప్రిల్ 14: ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపుతో గిద్దలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరి గీత అన్నారు. ఆదివారం బేస్తవారపేటలోని ఆర్‌కే.నగర్ జంక్షన్‌లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అరాచాకాలు ప్రజలు తట్టుకోలేకపోతున్నారని ప్రజలకు వివరించారు. గిద్దలూరు శాసన సభ్యులుగా ముత్తుముల అశోక్‌రెడ్డిని,పార్లమెంట్ సభ్యులుగా మాగుంట శ్రీనివాసరెడ్డిలను రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. గత కొంత కాలంగా టీడీపీ కార్యకర్తగా ఇంటింటి ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న జలగం అనితను అశోక్‌రెడ్డి సోదరీ సన్మానించారు.ఈకార్యక్రమంలో సోరెడ్డి మోహన్‌రెడ్డి,పూనూరు భూపాల్ రెడ్డి,బి.ప్రేమానందం,జలగం అనిత మూప్పూరి రాము,సైదులు,రోషన్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గిద్దలూరు, ఏప్రిల్ 14 : స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. అగ్ని ప్రమాదం జరిగిన తరువాత చర్యలు తీసుకోవడం కంటే ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక సిబ్బంది ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాల్చిన సిగరేట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పివేసి ట్రేలో వేయాలని, చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు అందుబాటులో ఉంచవద్దని సూచించారు. నాణ్యమైన ఎలక్ట్రికల్ వైరింగ్ వాడాలని, ఓవర్ లోడ్ ఉపయోగించవద్దని పేర్కొన్నారు. మంటలను ఆర్పివేసే పరికరాలను దుకాణాల్లో, పరిశ్రమల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రమాదం జరిగితే వెంటనే 101, 100, 108కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

119 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

కంభం, ఏప్రిల్ 14 : కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద అనుమతిలేని సిట్టింగ్ రూమ్‌లో అక్రమంగా నిలువ ఉంచి అధిక ధరలకు అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఈబీ అధికారుల కథనం ప్రకారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి శనివారం 119 క్వార్టర్ బాటిళ్లను నిర్వాహకులు నిల్వ ఉంచారు. నలగుల శేషారావు, దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న నరాల రమణరెడ్డి సిట్టింగ్ రూమ్‌లో అక్రమంగా నిలువ ఉంచి విక్రయిస్తున్నట్లు ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం రాత్రి 9గంటలకు సిబ్బంది దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 20వేల విలువైన 119 క్వార్టర్ బాటిల్స్‌ను సీజ్ చేయడమేకాక వారిపై కేసు నమోదు చేసి గిద్దలూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో కంభం ఎస్ఈబీ సీఐ ఎం.బాలక్రిష్ణ, ఎస్సై సత్యనారాయణరావు, మార్కాపురం డీటీఎఫ్ ఎస్ఈబీ ఎస్సై కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం సీసాలను సీజ్ చేసి ఎస్ఈబీ డీఎస్పీ దుర్గాప్రసాద్ ఆదివారం విలేకరులకు తెలిపారు.

పదేళ్ల బాలికపై లైంగిక దాడి

● నిందితుడి అరెస్టు

బేస్తవారపేట, ఏప్రిల్ 14 : పదేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించి మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ బాలిక (10) తన స్నేహితురాలి వద్దకు పుస్తకాలకు వెళ్లింది. అక్కడే ఉన్న యువకుడు కోల పిచ్చయ్య ఆ బాలిక చెయ్యిపట్టుకొని బలవంతంగా తన ఇంటిలోకి తీసుకెళ్లాడు. అనంతరం అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు ఇంటివద్దకు వచ్చారు. దీంతో యువకుడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడకు వెళ్లిన క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఘటనపై కేసు నమోదు చేశారు. నిందితుడిని ఆదివారం సాయంత్రం చెట్టిచెర్ల సమీపంలో ఉండగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.



కంభంలో తాపం తీర్చుకునేందుకు తాటిముంజలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పెరిగిన ఉష్ణోగ్రతలు

● శీతలపానీయాలకు డిమాండ్

కంభం, ఏప్రిల్ 14 : రోజురోజుకు భానుడు తన ప్రతాపం చూపుతుండడంతో వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ప్రజలు తాటిముంజలు, పుచ్చకాయలు, శీతలపానీయాలు, కొబ్బరి బోండాలు, చెరకురసం, మజ్జిగ కోసం ఎగబడడంతో వాటికి డిమాండ్ పెరిగింది. వేసవిలో వరుసగా రంజాన్, శ్రీరామనవమి పండుగలు ఉండడంతో గ్రామీణ ప్రాంతాల వారు సరుకులు కొనుగోలుకు కంభంకు విరివిగా వస్తుంటారు. మండుటెండలో తిరుగుతూ వస్తువులను కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకునేందుకు ఆరాట పడుతుంటారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఇలా ఉంటే మే నెలలో వేడితీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మరోమారు వైసీపీ కోడికత్తి డ్రామా

గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి

కొమరోలు, ఏప్రిల్ 14 : ఎన్నికల్లో ప్రజల సానుభూతి కోసం జగన్‌రెడ్డి మరో కోడికత్తి డ్రామాను తెరమీదకు తీసుకొచ్చారని, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని టీడీపీ ఎమెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డిచర్ల, సూరవారిపల్లి, బాదినేనిపల్లి, ఇడమకల్లు, రాజుపాలెం పంచాయతీలోని గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ చుట్టూ భారీ సెక్యూరిటీ ఉండగా, దాడి ఎలా జరిగిందని ప్రశ్నించారు. గతంలో జరిగిన కోడికత్తి డ్రామాలో నిందితుడు శ్రీను బయటకు వస్తె ఎక్కడ తమ కుట్ర బయటపడుతుందోని ఐదేళ్ల పాటు జైలులో ఉంచిన ఘనత ప్రజలందరికీ తెలుసన్నారు. మరోమారు సానుభూతి కోసం జగన్ రాయితో కొట్టించుకున్నారన్నారు. తోడబుట్టిన తల్లి, చెల్లిని రాష్ట్రం వదిలిపోయేలా చేసిన జగన్‌కు సానుభూతి ఎలా వస్తుందని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తారని వైసీపీ చేసే దుష్ప్రచారాలు నమ్మవద్దన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ గ్రామంలోనూ ఒక్క సిమెంట్ రోడ్డు వేయలేదని, టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో తన హయాంలోనే వేసిన సిమెంటు రోడ్లు ప్రస్తుతం దర్శనమిస్తున్నాయన్నారు. తాను గత ఎన్నికల్లో ఒడిపోయినప్పటికీ, గిద్దలూరులోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మే13న జరిగే ఎన్నికల్లో స్థానికుడనైన తనను ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసుల రెడ్డిను సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి బోల్లంకొండ సాయిబాబా మాట్లాడుతూ ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే, ప్రతి రైతుకు రైతు బంధు పథకాలు, యువతకు యువగళం, బీసీ రక్షణ చట్టం, ఇంటింటికీ, సురక్షిత మంచినీరు, పూర్ టూ రిచ్ వంటి పథకాలను అందిస్తామన్నారు. నిరంకుశ వైసీపీని గద్దె దించే సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బిజ్జాల తిరుమలరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పులకుర్తి వెంకటేశ్వర్లు, కో-ఆప్షన్ మాజీ సభ్యులు షేక్ నబీ, కాంట్రాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి, చలిచీమల శ్రీనివాసచౌదరి, లక్ష్మీనరసయ్య, గోడి ఓబుల్‌రెడ్డి, పోలెబోయిన రమణ, ఎంయల్లారెడ్డి, వి రాజారెడ్డి, లక్ష్మీరంగారెడ్డి, ఎ మోహన్‌రెడ్డి, గోపాలక్రిష్ణయ్య, బోయిళ్ల బాలిరెడ్డి, పందరబోయిన గంగయ్య, నాయకులు పాల్గొన్నారు.



స్థానిక సమస్యలపై ప్రజలతో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

4వ వార్డులో ఇంటింటి ప్రచారం

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని 4వ వార్డులో టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ ఆయన సతీమణి పుష్పలీల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఏబీఎం పాలెంకు వెళ్లగా ఆమెకు స్థానికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. అశోక్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏబిఎం పాలెంలో సిమెంటు రోడ్లు, తాగునీటి సమస్య తీర్చిన వైనాన్ని ఎస్సీ సామాజిక వర్గం మహిళలు గుర్తు చేయడం గమనార్హం. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డికి, ఎంపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పుష్పలీల కోరారు. టీడీపీ మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

యథేచ్ఛగా పంట కాలువ ఆక్రమణ

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 14: పట్టణంలో మార్కాపురం చెరువు నుంచి గతంలో పంట కాలువల ద్వారా పైర్లకు నీరు సరఫరా చేసేవారు. కొన్ని దశాబ్దాల క్రితం పైర్లకు నీటి కోసం పంట కాలువలను నిర్మించారు. కానీ ప్రస్తుతం ఆ కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. ఆ స్థానంలో పెద్ద పెద్ద భవనాలు అపార్ట్‌మెంట్లు నిర్మించారు. దీంతో పంట కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయి. 100 నుంచి 60 అడుగుల వెడల్పు వరకు ఉండాల్సిన పంట కాలువలు ప్రస్తుతం 10 నుంచి 20 అడుగులకే పరిమితం అయ్యాయి. కొన్నిచోట్ల కాలువల ఆనవాళ్లు కూడా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. పట్టణంలో ఎప్పుడైనా భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ పంట కాలువలు ఆక్రమణలకు గురికావడం వలన వర్షపు నీరు ఎటూ పోయే వీలు లేక నీరు రోడ్లపైకి ఇళ్లలోకి వచ్చే పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా ఉన్న ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణం పంట కాలువను దాదాపు ఆక్రమించినట్లుగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులకు అపార్ట్‌మెంట్ నిర్మాణం ఆక్రమణ విషయాలు తెలిసినప్పటికీ అనుమతులను ఇచ్చారు. కాలువకు అటువైపు ఇటువైపు ఆక్రమించి ప్లాట్లను వేసి ప్రైవేట్ వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే బోడపాడు రోడ్డులోని చెరువు పంట కాలువపై అనేక వ్యర్థాలను, దిబ్బలను కాలువపైనే వేస్తూ ఆక్రమించేస్తున్నారు. దీనివలన రోడ్డుపై వెళ్లే వాహనాలకు కూడా ఇబ్బందిగా ఉంటోంది. సంబంధిత అధికారులకు ఆక్రమణ విషయాలు తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండి పోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.



కాలువను ఆక్రమించి కట్టిన ఓ నిర్మాణం



కాలువగట్టును చదును చేసి వేసిన ప్లాట్లు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

పెద్దదోర్నాల, ఏప్రిల్ 14: అణగారిన వర్గాల ప్రజలకు ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎరిక్షన్‌బాబు అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమసమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. రాజ్యాంగం వల్ల బడుగు బలహీన వర్గాలకు భరోసా కలిగిందన్నారు. మహనీయుని ఆశయసాధనలో అందరూ నడవాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణానికి చెందిన అంబేడ్కర్ యువత ఆధ్వర్యంలో, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు పీ.తిరుమలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన త్యాగ నిరతిని గుర్తు చేసుకున్నారు.

త్రిపురాంతకం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 133వ జయంతిని మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకంలోని అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు, యువత పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలన్నారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లో భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కంభంలో షెడ్యూలు కలాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుబడిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్‌వలి, ఎంఈవో మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కందులాపురం కూడలిలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు పానుగంటి షాలెంరాజు, జిల్లా కార్యదర్శి నేదురుపల్లి జయరాజ్ పాల్గొన్నారు.



కంభం ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

దార్శనికుడు అంబేడ్కర్

మార్కాపురం వన్‌టౌన్ : అణగారిన వర్గాల సంక్షేమం కోసం పాటు పడిన దార్శనికుడు బీఆర్ అంబేడ్కర్ అని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో కోర్టు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం నివాళ్లర్పించారు. జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఎస్‌వీకేపీ కళాశాల సెంటర్ నుంచి కోర్టు సెంటర్ వరకు అంబేడ్కర్ చిత్రపటాన్ని గుర్రంపై ఊరేగింపుగా వచ్చారు. మాల మహానాడు ఐక్యవేదిక ఆధ్వర్యంలో, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్ ఆధ్వర్యంలో వేర్వేరుగా అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.





అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు, తర్లుపాడులో నివాళి అర్పిస్తున్న అంబేడ్కర్ యూత్

తర్లుపాడు : తర్లుపాడులో బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తర్లుపాడు పురవీధుల్లో 'జై భీమ్' నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ యూత్ అధ్యక్షులు పి.పుల్లయ్య, వనపర్తి నాగేంద్ర, వెంకటయ్యలు మాట్లాడుతూ. దేశ మొదటి న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన గొప్ప నాయకుడు, దేశ ప్రజల్లో సమానత్వం కోసం అహర్నిశలు పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు ఎం.కాశీకొండలు, రామయ్య, బెనర్జీ, కాశీరావు, ప్రసాద్, విజయ్, నాగేంద్ర, వెంకటయ్య పాల్గొన్నారు.

కొమరోలు : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి అన్నారు. మండలంలోని అల్లీనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం డాక్టర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌వీ నారాయణ, కే సుజాత, కోటేశ్వరరావు, ప్రకాశరావు, చంద్రమోహన్, గురవయ్య, బాలాజీలు పాల్గొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యులు సారె వెంకట నాయుడు, కోలా రాజేష్, ఎంపీటసీ సభ్యులు షేక్ సుభానీ, అంబేడ్కర్ల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.

గిద్దలూరు టౌన్ : మార్కెట్ సమీపంలోని అంబేడ్కర్ అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ వర్గాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్, టీడీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాన్వాలి, కాపు సంఘం నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, బాలచెన్నయ్య, కృష్ణ, టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అటవీశాఖ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి కమిషనర్ శ్రీనివాసరావు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకార రూపంలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఏప్రిల్ 14: గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు జిల్లా నలుమూలల నుంచి గంగమ్మకు మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో సందడిగా మారింది. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 14: ఆర్యవైశ్యులకు అండగా ఉంటామని కూటమి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక ప్రవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపి సీనియర్ నాయకుడు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు డాక్టర ఉగ్ర సమక్షంలో టీడీపీలో పెద్దఎత్తున చేరారు. ఈసందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనతో రాష్ట్రంలో ఆర్యవైశ్యులు వ్యాపారపరంగా తీవ్రంగా నష్టపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించటంతో పాటు వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. కనిగిరి ప్రాంతం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో నడికుడి రైల్వేమార్గం కోసం తాను కృషి చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే దర్శి ప్రాంతం వరకు రైల్వే మార్గం పూర్తి కావచ్చిందన్నారు. మూడు మాసాల్లో కనిగిరికి రైలు రాబోతోందన్నారు. అదేవిధంగా తన కుటుంబం కనిగిరి ప్రాంతం ప్రజలతో ముడిపడి ఉందన్నారు. పార్టీలకతీతంగా తమ కుటుంబాన్ని ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరిలో ఆర్యవైశ్యులకు తాను అండగా ఉంటానన్నారు. వ్యాపారాభివృద్ధిపరంగా పూర్తి సహకారం అంది స్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వాసవీ కుటుంబసభ్యులందరు తనను ఆదరించి మద్దతుగా నిలబడినందుకు తనకెంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్యనైజింగ్ సెక్రటరీ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం అధ్యక్షుడు డూండి రాకేష్, డీవీ మనోహర్, నీలిశెట్టి సుబ్బారావు, ఐవీనారాయణ, బొగ్గరపు శ్రీలత, బొగ్గరపు సద్గురు, మారుతి, ముక్కు జయసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఎంపీ మాగుంట, డాక్టర్ ఉగ్ర సమక్షంలో ప్రముఖ వ్యాపారవేత్త ఐటీసీ శ్రీను, నారాయణలు టీడీపీలో చేరారు.

మంచినీటి స్టోరేజీలకు సాగర్ జలాల పంపింగ్



చందవరం స్టోరేజీకి పంపింగ్ ద్వారా నింపుతున్న సాగర్ జలాలు

దొనకొండ, ఏప్రిల్ 14: ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాశయం నుంచి విడుదల చేసిన నీరు చందవరం గ్రామ సమీపానికి చేరింది. దీంతో మండలంలోని చందవరం-1, చందవరం-2 మంచినీటి స్టోరేజీలకు యుద్ధ ప్రాతిపదికన సాగర్ నీటిని పంపింగ్ చేస్తున్నారు. చందవరం-1 స్టోరేజీ పరిధిలో దొనకొండ మండలంలోని 29 గ్రామాల ప్రజలకు నీటి సరఫరా జరుగుతుంది. చందవరం-2 స్టోరేజీ కెనాల్‌కు అతి సమీపంలో ఉండటంతో పది రోజుల్లో నూరు శాతం స్టోరేజీ నింపి ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టినట్టు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ఈ స్టోరేజీ పరిధిలో హెచ్‌ఎంపాడు మండలంలోని 67 గ్రామాలు, కొనకనమిట్ల మండలంలోని 55 గ్రామాలు, పొదిలి మండలంలోని ఐదు గ్రామాలకు సాగర్ నీరు సరఫరా జరుగుతుంది. స్టోరేజీలను సాగర్ జలాలతో పూర్తిస్థాయిలో నింపి ఏప్రిల్, మే నెలల్లో మంచినీటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరపాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎస్‌పురం బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 14: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రేనాటి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటుచేశారు. వేసవిలో వివిధ పనుల కోసం గ్రామాల నుంచి వచ్చేప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మి, బి. రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడతున్న ఓబుల్‌రెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 14: టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన టీడీపీ మండల ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజయానికి ఐకమత్యంగా కృషి చేయాలన్నారు. గుమ్మడి సాయి మాట్లాడుతూ లక్ష్మి గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, షేక్ కాలేషావలి, గొల్లపూడి వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లు స్వాధీనం

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 14: మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకొని 20 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఆరేపాలెంలో ఓవ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్నారు. ఈక్రమంలో ఎస్‌ఐ తన సిబ్బందితో దాడి చేసి అతనిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

పామూరు, ఏప్రిల్ 14: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని పామూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు భైరెడ్డి జయరామిరెడ్డి అన్నారు. మండలంలోని వగ్గంపల్లి ఎస్టీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీ వాసులందరూ ఏకతాటిపై ఉగ్రకు మద్దతుగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తారని చెప్పారు. దాంతో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుం దన్నారు. కార్యక్రమంలో ఎం.గంగరాజుయాదవ్, వైప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్రకార్యదర్శిగా కోటపాటి నియామకం



జనార్దనరావు

పామూరు, ఏప్రిల్ 14: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పామూరుకు చెందిన పారిశ్రామికవేత్త కోటపాటి జనార్దనరావు నియమితులయ్యారు. ఈమేరకు టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయని ఆయన తెలిపారు. బొట్లగూడూరుకు చెందిన కోటపాటి టీడీపీ అభివృద్ధిలో ముఖ్య భూమిక వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. కోటపాటికి రాష్ట్ర కార్యదర్శి పదవి రావడంతో పామూరు, పీసీపల్లి మండలాల్లోని టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

పల్లెల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

- కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- 50 వైసీపీ కుటుంబాలు పార్టీలో చేరిక



వెలిగండ్ల: ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వెలిగండ్ల, ఏప్రిల్ 14: పల్లెల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మెటుపల్లి పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అధికారంలోకి రాగానే గన్నవరం పంచాయతీలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి, ముత్తిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గవదకట్ల హరి, ఇంద్రభూపాల్ రెడ్డి, చిలకల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జగన్ తెగిన గాలిపటంలా మార్చారు..

కనిగిరి, ఏప్రిల్ 14: రాష్ట్రాన్ని జగన్‌మోహన్‌రెడ్డి తెగిన గాలిపఠంలా మార్చారని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. మండలంలోని గురవాజీపేటలో ఎన్నికల శంఖారావం కార్యక్రమంలో ఆదివారం ఎంపీ మాగుంట పాల్గొన్నారు. కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని బల్లిపల్లి అడ్డరోడ్డు నుంచి గురువాజీపేట గ్రామం వరకు సాగిన భారీ బైక్ ర్యాలో పెద్ద ఎత్తున శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంపీ మాగుంట, డాక్టర్ ఉగ్ర కుగ్రామగ్రామాన ప్రజలు అడుగడుగునా హారతులిస్తూ పూలతో ఘనస్వాగతం పలికారు. గురవాజీపేట గ్రామస్థులు డాక్టర్ ఉగ్ర, ఎంపీ మాగుంటను గజమాలతో స్వాగతం పలకగా పార్టీ శ్రేణులు పూల దండలతో ముంచెత్తారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, మాగుంట రాఘవ రెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, ఉగ్ర తనయుడు జయసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గురవాజీపేటలో డాక్టర్ ఉగ్ర, ఎంపీ మాగుంటను గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

టీడీపీతోనే పల్లెలు సుభిక్షం

పీసీపల్లి, ఏప్రిల్ 14: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పల్లెలు సుభిక్షంగా ఉన్నాయని ఆపార్టీ నాయకులు అన్నారు. మండలంలోని వెంగళాపురం, భట్టుపల్లి గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడిని, కనిగిరి ఎమ్మెల్యేగా ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పువ్వాడి నాగరాజు, విజయ్, వీరపనేని పెద్దన్న, డబ్బుగొట్టు వెంకట్రావు, డబ్బుగొట్టు రవీంద్ర, ములకా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాగుంట, ఉగ్రకు సన్మానం

పామూరు, ఏప్రిల్ 14: కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డిలను పామూరు టీడీపీ శ్రేణులు శాలువలతో సత్కరించారు. సన్మానించిన వారిలో యువ పారిశ్రామికవేత్త యారవ శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్ ఆర్ రఫీ, వార్డు మెంబర్ పిడుగు శ్రీనివాసులు, ముబినా మౌలాలి, వాయినేని రాఘవ, కావేరి రసూల్, తదితరులు ఉన్నారు.

సానుభూతి కోసం వైసీపీ డ్రామా!

- కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి
- ఎన్నికల ప్రచారంలో అపూర్వ స్వాగతం



తూర్పుచౌటపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 14: ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి మరో కోడికత్తి డ్రామాకు తెరలేపారని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. దర్శి పట్టణంలోని 12, 17 వార్డుల్లో, మండలంలోని తూర్పుచౌటపాలెం, సామంతపూడి గ్రామంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. మహిళలు హారతులిచ్చి, పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. గత ఎన్నికల్లో కోడికత్తి సంఘటన అడ్డంపెట్టుకొని జగన్మోహన్‌రెడ్డి ప్రజల సానుభూతి పొందారని, ఇప్పుడు అదంతా డ్రామా అనే విషయం స్పష్టమైందన్నారు. బాధితుడు కోడికత్తి శ్రీను, అతని తల్లి చెబుతున్న వాస్తవాలు బయట పెట్టడంతో దిక్కుతోచక ప్రజల దృష్టి మరల్చేందుకు దాడి ఘటనను చిత్రీకరించారని విమర్శించారు. సీఎం భద్రతా వలయాన్ని ఛేదించి రాయి ఎలా తగులుతుందని ఆమె ప్రశ్నించారు. ఒకవేళ అలా జరిగిఉంటే అది పూర్తిగా భద్రతా వైఫల్యమన్నారు. ప్రజలు అన్నీ విషయాలను గమనిస్తున్నారని, ఎన్నికల్లో వైసీపీ డ్రామాకు తెరపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీనివాసులు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, జనసేన మండల అధ్యక్షురాలు కుప్పాల భూలక్ష్మి, కౌన్సిలర్ పాణ్యం వలిబాబు, మాజీ సర్పంచ్‌లు కె.వెలిగొండారెడ్డి, మారం ధనలక్ష్మి, మారం శ్రీనివాసరెడ్డి, పోకూరు కిష్టయ్య నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న రాగమక్కపల్లి గ్రామస్థులు

టీడీపీలోకి భారీగా చేరికలు

దర్శి, ఏప్రిల్ 14: దర్శి నియోజకవర్గంలో రోజురోజుకు టీడీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. వైసీపీ అరాచక పాలనతో విసుగుచెందిన ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో చేరుతున్నారు. తాజాగా దర్శి మండలం దేవవరం పంచాయితీలోని కట్టుబడివారిపాలెం హరిజన కాలనీవాసులు తొమ్మిది కుటుంబాలు టీడీపీలో చేరారు. దొనకొండ మండలం ఇండ్లచెరువు పంచాయతీలోని రాగమక్కపల్లి గ్రామానికి చెందిన 20 ఎస్సీ కుటుంబాలు టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్న నిర్ణయానికి ప్రజలు వచ్చారని చెప్పారు. కార్యక్రమంలో దర్శి, దొనకొండ మండలాల టీడీపీ అధ్యక్షులు చిట్టే వెంకటేశ్వర్లు, నాగులపాటి శివకోటేశ్వరరావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దేవవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు అంకయ్య, పైడిపోగు జేజే రావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయసాధనకు కృషిచేయాలి




కనిగిరి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ ఉగ్ర, ఎస్సీ సెల్ నాయకులు

కనిగిరి, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అంబేద్కర్ 113వ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆదివారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి డాక్టర్ ఉగ్ర పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు బుల్లా బాలబాబు ఆధ్వర్యంలో ఒంగోలు బస్టాండు సెంటరులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనలో బలహీన వర్గాలను పెత్తందారులు అణగదొక్కబడుతున్నా ఓటు అనే ఆయుధమే వారికి శ్రీరామరక్షగా నిలిచిందన్నారు. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కుల వలనే ఇది నేడు సాధ్యమైందన్నారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కల్గిస్తూ వైసీపీ సాగించిన దుర్మార్గపు పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని డాక్టర్ ఉగ్ర పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కె.రామ్మోహన్, కుంచెం జక్రయ్య, సూరె రాజు, తాతపూడి స్టాలిన్(బుజ్జి), దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, షేక్ వాజిదాబేగం, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఆరాధ్యులు అని టీడీపీ సీనియర్ నాయకుడు వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి) అన్నారు. స్థానిక వైఎస్సార్ రోడ్డులో ఎన్టీయార్ అభిమానుల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఎస్థానిబాషా(పులి), ఉంగరాల బాషా, తాతపూడి ఐజాక్, తాతపూడి బ్రాక్, కొండలు, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాపారావు తదితరులు

అంబేద్కర్ అని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కొనియాడారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అలాగే, సీపీఐ, వైసీపీ, బీటీఏ, ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, ఎం హుసేన్‌రావుయాదవ్, కావిటి సుబ్బయ్య, బీజేపీ నాయకులు, కేవీ రమణయ్య, జె.చిన సుబ్బయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, మాలకొండయ్య, యేసురత్నం, ఇండ్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో.. వెలిగండ్ల, ఏప్రిల్ 14: డాక్టర్ అంబేద్కర్ సంస్కరణలకు ఆద్యుడని డా. ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెలిగండ్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈసంద్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు, బలహీనవర్గాలు, దళితుల సంక్షేమం కోసం పోరాడిన యోధుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి, ముత్తిరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, గొనా ప్రతాప్, యక్కంటి రమణారెడ్డి, కొండు బాస్కర్ రెడ్డి, బొబ్బారమణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో.. దొనకొండ, ఏప్రిల్ 14: దొనకొండలోని అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, బొందల రాజు, కొమ్మతోటి సుబ్బారావు, కుందుర్తి లక్ష్మణ్, ఒబ్బాపురం అంబేద్కర్ యూత్ సభ్యులు పాలాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. దొనకొండ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారీ, దేవానంద్, గ్రామ కార్యదర్శి డేవిడ్, ఉప సర్పంచ్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ప్రగతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యదర్శి ఏనుబరి రవి అధ్యక్షతన అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ జాన్ ప్రకాష్, ఎంపీటీసీ జాన్‌మార్క్, గ్రామస్థులు పాల్గొన్నారు.

దర్శిలో.. దర్శి, ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తదితరులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, పరిశుద్ధరావు, గొర్రె సుబ్బారెడ్డి, కనకం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసీపీ కార్యాలయంలో, తూర్పు హరిజన వాడలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పొట్లపాడు దళితవాడలో ఆదివారం రాత్రి జయంతి వేడుకలు నిర్వహించారు. పలు కాలనీలలోనూ వేడుకలు నిర్వహించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

జయహో బీసీ సదస్సును జయప్రదం చేయాలి

దర్శి, ఏప్రిల్ 14 : జయహో బీసీ సదస్సుకు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన జయహో బీసీ సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడారు. దర్శిలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 4గంటలకు నియోజకవర్గ స్థాయి జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమనే విషయాన్ని గుర్తించాలన్నారు. బీసీలకు రాజ్యాధికారం అందించి ఉన్నత పదవులతో గౌరవాన్ని ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మోడి వెంకటేశ్వర్లు ముండ్లమూరు, కురిచేడు మండలాల అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, పినెమలయ్య, దర్శి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, బీజేపీ నేతలు మాడపాకుల శ్రీనివాసావు, నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ఆర్యవైశ్యుల అభ్యున్నతి



ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాగుంట రాఘవరెడ్డి, నారపుశెట్టి పాపారావు తదితరులు

దర్శి, ఏప్రిల్ 14: టీడీపీ హయాంలోనే ఆర్యవైశ్యులకు అన్నిరకాలుగా ప్రాధాన్యం కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేయటం జరిగిందని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనివాస పద్మావతి కల్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆర్యవైశ్యులకు ఎన్నో ఉన్నత పదవులు కట్టబెట్టి గౌరవించారన్నారు. జిల్లాలోని పలువురు ఆర్యవైశ్య నాయకులు జాతీయ, రాష్ట్రస్థాయిలో కీలక పదవులు నిర్వహించిన విషయం తెలిసిందేనని అన్నారు. భవిష్యత్తులో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించటం జరుగుతుందని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు సూరె సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మాగుంట రాఘవరెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఒగ్గు పవన్‌కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అచ్చుత గురువార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి



మాట్లాడుతున్న ఈఆర్‌వో లోకేశ్వరరావు

దర్శి, ఏప్రిల్ 14: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధి కారి ఎంవీఎస్ లోకేశ్వరరావు కోరారు. మండలంలోని తూర్పువీరాయపాలెంలో ఆదివారం ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఎన్నికల నిబంధనలు తుచ తప్పకుండా పాటించాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఎస్పీ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ అశోక్ వర్ధన్‌రెడ్డి, సీఐ షేక్ షమీముల్లా, ఎస్సై సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 15 ఏప్రిల్ 2024





తెనాలిలో అభిమానులు, కార్యకర్తలకు అభివాదం తెలుపుతున్న పవన్‌కళ్యాణ్, పెమ్మసాని, మనోహర్



బస్సెక్కిన అభిమానం



● గజమాలతో అభిమానుల సత్కారం



తెనాలి మార్కెట్ సెంటర్‌లో సభకు హాజరైన అశేష జనవాహిని

జగన్‌ను తరిమికొట్టాలి

ప్రజల కోసం.. వారి శ్రేయస్సు కోసం.. రాష్ట్రం కోసం.. అమరావతి రాజధాని అభివృద్ధి కోసం.. అందరికీ అన్నం పెట్టే రైతుల శ్రేయస్సు కోసం.. నిరుద్యోగులు, కార్మికుల కష్టాలు తీర్చడం కోసం, ప్రజలందరికీ మంచి జరిగేలా సైకో ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు పవన్‌కల్యాణ్ అనే నేను జనసేన పార్టీని స్థాపించి మీ ముందుకు వచ్చాను. సైనికుడిలా ప్రభుత్వంపై పోరాడుతున్నాను.. నా పోరాటానికి మీరంతా మద్దతుగా నిలిచారు.. మీ కోసం వచ్చా.. మార్పు కోసం ప్రయత్నిస్తున్నా.. రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకోవాలి. పేదల పక్షపాతులమంటూ వారిపైనే పెత్తందారులుగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నారు. పేదల సంక్షేమం పేరుతో కోటానుకోట్లు దోచేసిన వైసీపీ జగన్ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరమికొట్టాలి.

పవనాభిమానం

తెనాలిలో ప్రభంజనం

- జనసేనానికి అపూర్వ స్వాగతం
- వారాహి విజయభేరికి జననీరాజనం
- రెండు కిలోమీటర్ల దూరానికి 2 గంటలు
- భారీ గజమాలలతో అభిమానుల సత్కారం



రోడ్‌షోలో పాల్గొన్న జనసేన, టీడీపీ, బీజేపీ అభిమానులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 14: పవనాభిమానం పోటెత్తింది.. జనసేనానికి తెనాలి నీరాజనం పలికింది. తొలిసారి తెనాలి పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అభిమానులు గజమాలలతో స్వాగతం పలకగా.. మహిళలు హారతులు పట్టి దిష్టితీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం వారాహి విజయభేరి సభలో పాల్గొనేందుకు తెనాలి వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో సుల్తానాబాద్‌లో దిగారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వారాహి వాహనంపై సుల్తానాబాద్, చెంచుపేట, మారీస్‌పేట మీదగా మహాత్మాగాంధీ మార్కెట్ కూడలి వరకు రోడ్ షో నిర్వహించారు. ఆయన వెంట పెద్దసంఖ్యలో అభిమానులు ద్విచక్రవాహనాలతో ర్యాలీగా పాల్గొన్నారు. దారిపొడవునా జనం నీరాజనం పట్టారు. కేవలం 2 కి.మీటర్ల దూరం రోడ్ షోకు రెండున్నర గంటలకుపైగా సమయం పట్టింది. అంగలకుదురు గణేష్ యూత్ నాయకుడు వీరవల్లి మురళి బృందం ఎక్స్‌కవేటర్ల సాయంతో భారీ గజమాలతో పవన్ కల్యాణతో పాటు, లోక్‌సభ, అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లను సత్కరించారు. దారిపొడవునా డివైడర్లపైన, భవనాలపైన జనం కిక్కిరిసి పోయారు. వారందరికీ పవన్ వారాహిపై నుంచి విజయకేతనం చూపుతూ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



రైతుల సమస్యలు వింటూ...

మార్కెట్ సెంటర్‌కు పోటెత్తిన జనం

మార్కెట్ సెంటర్‌లో సాయంత్రం 6 గంటలకు పవన్‌కల్యాణ్ వారాహిపై నుంచి ప్రసంగిస్తారని జనసేన నేతలు ప్రకటించారు. దీంతో సాయంత్రం 4 గంటలకే పెద్దసంఖ్యలో అక్కడకు జనం భారీగా చేరుకున్నారు. ఆయన సభ మొదలయ్యే సమయానికి సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. చాలావరకు గుంటూరు, వియవాడ ప్రధాన రహదారులపైనే జనం నిరీక్షించాల్సి వచ్చింది. భారీ సంఖ్యలో జనాన్ని చూసిన పవన్‌కల్యాణ్ ఉత్సాహంతో ప్రసంగాన్ని పరుగులు పెట్టించారు. మహిళలు, యువత, ఉద్యోగుల సమస్యలపై జనసేనాని ప్రసంగించేటప్పుడు జనం నుంచి భారీగా స్పందన వచ్చింది. పార్టీకి చిరంజీవి రూ.5 కోట్లు విరాళం ఇవ్వడంతో పాటు రామ్‌చరణ్‌ను కూడా విరాళం ఇవ్వాలని చెప్పారని, ఆయనకు తెనాలి వేదికగా కృతజ్ఞతలు చెబుతున్నట్లు ప్రకటించటంతో జనం నుంచి కేరింతలు వినిపించాయి. అంతకముందు హెలిప్యాడ్ వద్ద పవన్‌కు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్,మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



అభిమానులతో సెల్ఫీ



కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా తదితరులు

ఓటేయడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 14: రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకున్నప్పుడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు ఘననివాళి అర్పించినట్లు అవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించా రు. జిల్లా అధికారులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజలందరూ అన్ని హక్కులతో స్వేచ్ఛగా జీవించడానికి ముఖ్య కారణం అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగమేనన్నారు. సామాజిక అంతరాలపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయులు అంబేద్కర్ అన్నా రు. దేశంలోని ప్రజలందరూ సమానంగా జీవించాలనే అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, మత్స్యశాఖ ఏడీ సైదా పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

కొనసాగుతున్న చేరికల పర్వం
దిక్కుతోచని స్థితిలో పాలక పార్టీ

బాపట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. పర్చూరు నియోజకవర్గంలో అధికార పార్టీలోని కీలక నేతలు దాదాపు టీడీపీ బాట పడుతున్నారు. ఇప్పటికే చాలామంది కీలకనేతలతో పాటు కార్యకర్తలు కుటుంబాలతో సహా తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. చినగంజాం మండలానికి చెందిన వైసీపీ నేతలతో పాటు కార్యకర్తలు దాదాపు వెయ్యి మంది వారి కుటుంబాలతో సహా ఇటీవల టీడీపీ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. ఇక ఆదివారం నియోజకవర్గ పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ చేరికల పర్వంతో పర్చూరులో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. మరో వైపు ఇప్పటికే కాడి వదిలేసిన పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ మొక్కుబడి పర్యటనలతో సరిపెడుతున్నారన్న ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది.

సస్పెన్షన్ ఎత్తివేత..

మాజీ మంత్రి బాలినేని అనుచరుడిగా ఉన్న భవనం శ్రీనివాసరెడ్డిపై గతంలో వైసీపీ అధిష్ఠానం సస్పెన్షన్ విధించింది. ఈయనపై చర్యలు తీసుకోవడంలో అప్పటి ఇన్‌చార్జి ఆమంచి ఒత్తిళ్లే పనిచేశాయనే ప్రచారం జోరుగా నడిచింది. సీన్ కట్ చేస్తే పర్చూరులో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొని ఉండడంతో ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను విధిలేని పరిస్థితుల్లో ఎత్తివేస్తూ వైసీపీ అధిష్ఠానం ఆదివారం నిర్ణయం తీసుకుంది. చినగంజాం మండలానికి చెందిన వైసీపీ నేత, ఓ ముఖ్య ప్రజాప్రతినిధి టీడీపీలో చేరడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. మాజీ మంత్రి బాలినేని తనయుడి బుజ్జగింపుతో తాత్కాలికంగా ఆయన దానిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. కానీ ఇప్పటికే ఆ మండలంలోని ద్వితీయశ్రేణి నేతాగణమంతా టీడీపీ గూటికి చేరడం గమనార్హం. తర్వలో సదరు ముఖ్య నేత కూడా టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.



మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాస్తి వెంకటనారాయణను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు

నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఆందోళనలు ● ప్రేక్షకపాత్రకే పరిమితమైన ఎన్నికల అధికారులు

అద్దంకి, ఏప్రిల్ 14: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రాజకీయ నేతల కార్యక్రమాలకు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. అయితే అద్దంకిలో వైసీపీ నేతలు ఎన్నికల నియమావళిని పట్టించుకోవడంలేదు. వైసీపీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘి స్తున్నా అధికారులకు పట్టడంలేదు. అధికార పార్టీకి అధికారులు కొమ్ముకాస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఇటీవల అద్దంకిలో పలు సంఘటనలు చోటుచేసుకోగా, ఆదివారం మధ్యాహ్నం ఏకంగా నామ్‌రోడ్డుపై రాస్తారోకో చేశారు. విజయవాడలో సీఎంపై రాయి దాడిని నిరసిస్తూ ఆదివారం పట్టణంలోని శింగరకొండరోడ్డులో వైసీపీ కార్యాలయం ఎదుట నామ్‌రోడ్డుపై వైసీపీ అద్దంకి అభ్యర్థి పాణెం చినహనిమిరెడ్డి పలువురు నేతలు, కార్యకర్తలతో కలిసి రాస్తారోకో చేశారు. కూటమి పార్టీలు దురుద్దేశంతో జగన్‌పై దాడి చేయించాయని ఆయన ఆరోపించారు. పైగా వైసీపీ తలుచుకుంటే టీడీపీ నేతలు, కార్యకర్తలకు పుట్టగతులు ఉండవని తీవ్రస్థాయిలో హెచ్చరిస్తూ మాట్లాడారు. ఉన్నతాధికారులు స్పందించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వైసీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.



రాస్తారోకో చేస్తున్న వైసీపీ అభ్యర్థి చినహనిమిరెడ్డి, శ్రేణులు

ఎమ్మెల్యే రఘుపతిపై ఫిర్యాదు

బాపట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం స్థానిక జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర అంబేద్కర్ విగ్రహం వద్ద తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులకు సంబంధించి వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతిపై టీడీపీ నేతలు బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. పార్టీ శ్రేణుల తో కలిసి రెచ్చగొట్టే విధంగా కోన వ్యవహరించాని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. ఉద్రిక్తత లు తలెత్తడానికి కారణం ఆయనేనని అందులో వివరించారు. ఫిర్యాదు తీసుకునే విషయంలో దాదాపు గంటపాటు పోలీసులు తర్జనభర్జన పడ్డట్లు సమాచారం. డీఎస్పీతో సంప్రదించిన అనంతరం టీడీపీ నేతల నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు. టీడీపీ నేతల ఫిర్యాదు అందిందని కేసు నమోదు విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని టౌన్ సీఐ తెలిపారు.



గొట్టిపాటికి దిష్టి తీస్తున్న మహిళలు

అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే..

● కూటమి అభ్యర్థి గొట్టిపాటి

మేదరమెట్ల, ఏప్రిల్ 14 : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చేయగల ఏకైక నాయకుడు చంద్రబాబు అని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం మేదరమెట్లలో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను రవికుమార్ పంచిపెట్టారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ అధికారంలోకి రాగానే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలు, యువత, రైతులు, కార్మికులు అన్ని వర్గాల ప్రజలు జగన్‌రెడ్డి పాలనలో అన్ని విధాలా నష్టపోయ్యారన్నారు. ప్రజా వేదిక కూల్చివేతతో మొదలుపెట్టి విధ్వంసాలతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గొట్టిపాటికి మాజీ జడ్పీటీసీ శివకుమారి మద్దతు

మేదరమెట్ల జడ్పీటీసీ మాజీ సభ్యురాలు కట్టా శివకుమారి ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కొరిశపాడు ఎస్సీ కాలనీకి చెందిన తేళ్ల ఏడుకొండలు తదితర 15 కుటుంబాలు ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. ఆదివారం ఉదయం మేదరమెట్లలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మన్నె రామారావు ఇంటి వద్ద అద్దంకి మండలం ఉప్పలపాడుకు చెందిన నీలం ప్రసాద్, అనంతు బ్రహ్మయ్య, రత్నాకర్, నరసింహారావు, రమేష్‌బాబు, సాయి, శ్రీను, పొట్లూరి కనకయ్య తదితరులకు రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో గొట్టిపాటి సమక్షంలో శివకుమారితో పాటు కొమ్మాలపాటి భాను, నాగేంద్రం, అంజమ్మ, కవిత, తెలగతోటి మౌనిక, ఉలవపాటి సుగుణ, కొమ్మాలపాటి పూర్ణచంద్రరావు, నరసింహారావు, దార్ల ఆదిమూర్తి, కాళీ, బ్రహ్మయ్య, కట్టా రమేష్, గుడిమెట్ల నాగేశ్వరరావులు పార్టీ కండువాలు కప్పుకుని రవికుమార్‌కు మద్దతు ప్రకటించారు. కొరిశపాడుకు చెందిన తేళ్ల ఏడుకొండలు, తేళ్ల ఆనందరావు, తేళ్ల చిరంజీవి, తేళ్ల వెంకటేశ్వర్లు, సాల్మన్, అంజయ్య ఏసురాజు రాజులతో పాటు 15 కుటుంబాలు పార్టీలో చేరారు.

సానుభూతి కోసం జగన్‌రెడ్డి రాయి డ్రామా

● ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 14 : ఎన్నికల ప్రచారంలో జగన్‌రెడ్డికి ప్రజావ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో సానుభూతి కోసం రాయి డ్రామా ఆడుతున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ప్రకటనలో విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ప్రజలకు చెప్పుకోవడానికి ఒక్క మంచి పనీ లేకపోయిందన్నారు. అనుభవరాహిత్యం, అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఒక్క పరిశ్రమను తేలేదని, ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయకుండా రాష్ట్ర పురోగతిని బలి ఇచ్చారన్నారు. నాలుగు రోజులలో సంచలనమైన సంఘటన జరుగుతుందని, ఎన్నికల మూడ్‌ను మార్చేస్తుందంటూ వైసీపీ సోషల్‌మీడియా చెప్పిన విధంగానే గులకరాయి సంఘటన జరగడం డ్రామాలో భాగం కాదా అని గొట్టిపాటి ప్రశ్నించారు. 2019లో కోడికత్తి డ్రామా, చిన్నాన్న హత్య, ఒక్క చాన్స్ ఇవ్వాలంటూ జగన్ డ్రామాలాడి ప్రజలను మోసగించారన్నారు. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభంజనాన్ని సృష్టిస్తుందని తెలుసుకొని రాయి డ్రామాకు తెరలేపారన్నారు. రాత్రి 7 గంటలకు కరెంట్ తీయటం, 8-10కి దాడి జరిగిందని ప్రచారం చేయడం, రాత్రి 11 గంటలకు కుటుంబసమేతంగా ఆసుపత్రికి వెళ్లడం సానుభూతి నాటకాలు కాదా అని ప్రశ్నించారు. వైసీపీ సభలో దాడి జరిగితే చుట్టూ ఉంది వైసీపీ కార్యకర్తలు, పోలీసులు అయినప్పుడు ఎందుకు పట్టుకోలేదన్నారు. విజయవాడ లో సీఎం పర్యటన సందర్భంలో 3 గంటలు విద్యుత్ కోత విధించారని, ఆయన పర్యటనకే విద్యుత్ సరఫరా చేయలేని దుస్థితిలో రాష్ట్రం ఉందా అన్నారు. జగన్‌రోడ్ షోకు ఎలా అనుమతించారని, ఇది ముందస్తు కుట్రలో భాగం కాదా అని ప్రశ్నించారు. సీఎంకే రక్షణ కల్పించలేని సీఎస్, డీజీపీ, ఇంటిలిజెన్స్ చీఫ్‌ను ఈసీ వెంటనే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. వైసీపీ డ్రామాలు ప్రజలు నమ్మే రోజులు పోయాయని, వైసీపీకు గుణపాఠం చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని గొట్టిపాటి రవికుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు

టీడీపీలో చేరిన ఉప్పలపాడు వాసులు

అద్దంకి, ఏప్రిల్ 14 : మండలంలోని ఉప్పలపాడుకు చెందిన 10 వైసీపీ కుటుంబాలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఉప్పలపాడుకు చెందిన నీలం ప్రసాద్, అనంత బ్రహ్మయ్య అనంత రత్నాకర్, నీలం నరసింహారావు, రమేష్ బాబు, బు ర సాయి, నీలం శ్రీను, పొట్లూరి కనకయ్య తదితరులకు ఎమ్మెల్యే రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

నేడు అద్దంకిలో ప్రచారం

అద్దంకి మున్సిపాలిటీలోని 13వ వార్డులో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కౌన్సిలర్ విజయలక్ష్మి మాధవరావు కోరారు.



దివ్యాంగురాలికి ట్రై సైకిల్, పేదల మహిళలకు చీరలు అందజేస్తున్న వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనిత సభ్యులు

పేదలకు చీరల పంపిణీ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 14 : అద్దంకిలోని వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక గీతామందిరిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ రిజనల్ చైర్మన్ సాతులూరి చంద్రకళ పాల్గొని క్లబ్ కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఐతా రాజా ఆర్థిక సాయంతో దివ్యాంగురాలకు ట్రై సైకిళ్లను అందజేశారు. అలాగే ఎనిమిది మంది పేద మహిళలకు చీరలను అందజేశారు. ఈనెల 16వ నుంచి క్లబ్‌ల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు వీవీ ఆదినారాయణ, వీ విజయలక్ష్మి, గొల్ల పాపారావు, అంజలి, చిన్ని మురళికృష్ణ, తమ్మన శ్రీనివాసరావు, సునీల్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

అంత సీన్ లేదు!

పేలవంగా చెవిరెడ్డి పరిచయ సమావేశాలు

కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లో వెలవెల

గిద్దలూరులో అన్ని మండలాలకూ వెళ్లని వైనం

ఒంగోలులో ఆఫీసు కూడా పెట్టని వైసీపీ ఎంపీ అభ్యర్థి

సమస్యల ప్రస్తావనే కరువు

ఆరోపణలకు సమాధానమే లేదు



వైసీపీ అధినేత జగన్‌రెడ్డి ఏరికోరి తెచ్చుకున్న ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హవా ఊహించినంతేమీ లేదని తేలిపోతోంది. ఆయన పరిచయ కార్యక్రమాలు పేలవంగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల వెలవెలబోతున్నాయి. ఆయన పసలేని ప్రసంగాలకు కార్యకర్తలు సైతం నీరసపడిపోతున్నారు. మంచి విందు ఏర్పాటు చేశాం రండహో అని చాటింపు వేసినా సమావేశ మందిరాలు నిండడం లేదు. అన్ని ప్రాంతాల్లో పార్టీ ముఖ్య నేతలు సైతం డుమ్మా కొడుతున్నారు. ప్రత్యేకించి కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లో నిర్వహించిన సమావేశాలు తుస్సుమన్నాయి. కొన్ని చోట్ల మండలాల వారీ కాకుండా ఒక్కచోటనే ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు పరిమితమయ్యారు. పశ్చిమప్రాంతంలో అక్కడక్కడా సొంత కార్యాలయాలు, తానుండేందుకు అతిథి గృహాలు ఏర్పాటు చేసుకొన్న చెవిరెడ్డి.. ఒంగోలులో కనీసం ఆఫీసును కూడా తెరవకపోవడం చర్చనీయాంశమైంది. తనపై వచ్చిన స్మగ్లర్ అన్న ఆరోపణలను కూడా ఆయన తిప్పికొట్టే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా స్థానిక నాయకులందరినీ కాదని తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని వైసీపీ తరఫున సీఎం జగన్ రంగంలోకి దింపారు. స్థానికుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని అనేక మంది ఆపార్టీ నాయకులు పట్టుబట్టారు. ఈవిషయంలో ఆపార్టీ సీనియర్ నాయకుడు బాలినేని చివరి వరకు జగన్‌తో ఫైట్ కూడా చేశారు. కానీ ఆయన వినిపించుకోలేదు. ఎంపీగా ఉన్న మాగుంటను తన గడప కూడా తొక్కవద్దంటూ హెచ్చరించిన జగన్.. నియోజకవర్గంలోని వైసీపీ నాయకుల అభిప్రాయానికి భిన్నంగా ఎక్కడో ఉన్న రాయలసీమకు చెందిన చెవిరెడ్డిని ఇక్కడ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆరంభంలో ఆయన హడావుడి అధికంగా కనిపించింది. ఆపార్టీ తరఫున అసెంబ్లీ అభ్యర్థులుగా రంగంలో ఉన్నవారికి ఆర్థిక చేదోడును కూడా ఇచ్చి ప్రోత్సహించినట్లు వినిపించింది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో వలంటీర్లకు ఇచ్చిన తాయిలాలు ఆయన ఘనతేనని బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అన్ని ప్రాంతాల్లో తన సొంత మనుషులు ఉండేందుకు ప్రత్యేక విడిది భవనాలను, ఆయన బస చేసేందుకు ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటుచేసుకుంటూ హడావుడి చేశారు. ఏప్రాంతంలో ఆయన విడిది అతిథిగృహం వద్ద చూసినా వాహనాల రాకపోకలు అధికంగా కనిపిస్తున్నాయి. అయితే ఒంగోలులో మాత్రం ఆయన ఉండేందుకు కూడా వసతిని ఏర్పాటు చేసుకోలేదు. ఎప్పుడో వస్తూపోతూ లాడ్జిలలోనే దిగుతున్నట్లు సమాచారం. ఆయన సొంత మనుషులు నియోజకవర్గంలో తిరగడం కూడా ఒంగోలులో పెద్దగా కనిపించడం లేదు. పశ్చిమ ప్రాంతంలోని కొన్ని నియోజకవర్గాలలో రోజువారీ చెవిరెడ్డి మనుషులు గ్రామాలకు వెళ్లి హడావుడి చేయడం కనిపిస్తోంది. అయితే ఒంగోలులో మాత్రం అలాంటి పరిస్థితి లేదు. ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని అంటే భయంతోనో, నమ్మకంతోనో ఆయన ఒంగోలుకు తన మనుషులను దూరంగా ఉంచి ఉండవచ్చని భావిస్తున్నారు.



సింగరాయకొండలో జనం లేక వెలవెలబోతున్న చెవిరెడ్డి పరిచయ సమావేశం (ఫైల్)

పేలవంగా సమావేశాలు

అన్ని నియోజకవర్గాల్లో మండలాల వారీ పరిచయ కార్యక్రమాలకు చెవిరెడ్డి శ్రీకారం పలికారు. ఇప్పటి వరకూ జరిగిన కార్యక్రమాలన్నీ పేలవంగా జరిగాయి. శనివారం కొండపి అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన పరిచయ కార్యక్రమాలు, అంతకుముందు కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనాలు వెలవెలబోయాయి. నియోజకవర్గ కేంద్రమైన కనిగిరిలో వేసిన 600 కుర్చీలే నిండలేదు. అయితే సమావేశం కిటకిటలాడినట్లు ప్రచారం చేసుకున్నారు. పీసీపల్లి, పామూరు మండలాల్లో జరిగిన కార్యక్రమాలు మొక్కుబడిగా సాగాయి. అంతోఇంతో సీఎస్‌పురం, వెలిగండ్ల సమావేశాలకే ఆపార్టీ శ్రేణులు హాజరయ్యారు. కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి నారాయణయాదవ్‌ను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ మర్యాదకోసమైనా ఒక్క సమావేశానికి కూడా హాజరుకాలేదు. ఇక మధుసూదన్ యాదవ్‌కు మద్దతిస్తూ నియోజకవర్గంలో అసమ్మతి గళం వినిపిస్తున్న పలువురు నాయకులు ఆయా మండలాల్లో చెవిరెడ్డి నిర్వహించిన సమావేశాలకు గైర్హాజరయ్యారు. శనివారం కొండపి నియోజకవర్గంలో జరిగిన ఆయన పరిచయ కార్యక్రమాల తీరుతెన్ను కూడా అలానే కనిపించింది. కీలకమైన కొండపి, సింగరాయకొండలలో జరిగిన కార్యక్రమాలు బోసిపోయాయి. మిగిలిన మండలాల్లో కూడా వందల సంఖ్యలో తప్ప కనీసం వెయ్యిమంది కూడా ఎక్కడా హాజరుకాలేదు. ఇక సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ వెంకయ్యతో పాటు ఆయా మండలాల్లో అంతో ఇంతో ప్రజలతో సంబంధాలున్న పలువురు నాయకులు ఈ సమావేశాలకు డుమ్మా కొట్టారు. గిద్దలూరు నియోజకవర్గంలో మండలాల వారీ కాకుండా ఒక్క గిద్దలూరులో మాత్రమే పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ నగర పంచాయతీ, రూరల్ మండలాలకు సంబంధించి హాజరైన పార్టీ శ్రేణులతో సమావేశ మందిరమే నిండలేదు. అంతకుముందు కార్ల ర్యాలీతో మాత్రం హడావుడి చేశారు.

బూచేపల్లి ప్రసంగాలతో బిత్తరపోయిన వైనం

దర్శి నియోజకవర్గంలో జరిగిన పరిచయ కార్యక్రమాల్లో అసెంబ్లీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేసిన ప్రసంగాలతో చెవిరెడ్డి సైతం బిత్తరపోయారు. బూచేపల్లి తన ప్రసంగంలో పార్టీ కార్యకర్తలు అనకుండా నా కార్యకర్తలు.. నా కార్యకర్తలు అంటూ మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు గతంలో కాంగ్రెస్‌కు లేదా వైసీపీకి పట్టం కట్టారని అనకుండా అప్పుడు రాజశేఖరరెడ్డికి.. ఇప్పుడు జగన్‌కే మద్దతుగా నిలిచారని పొగిడారు. వెన్నుపోటుదారులున్నారు, వారి సంగతి చూస్తానంటూ హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాల్లో పొదిలిలో జరిగిన సమావేశం పర్వాలేదనిపించగా మిగిలిన మండలాల్లో పేలవంగానే జరిగాయి. ఆదివారం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఆయన పరిచయ కార్యక్రమాల కూడా వైసీపీ శ్రేణుల నుంచి ఆశించిన స్పందన కరువైంది.

పసలేని ప్రసంగాలు శ్రేణుల్లో నిరుత్సాహం

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రసంగాలలో పసలేకపోవడం ఆపార్టీ శ్రేణులను నిరుత్సాహపరుస్తోంది. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు కొద్దిరోజుల క్రితం మార్కాపురంలో జరిగిన సభలో చెవిరెడ్డి ఎర్రచందనం స్మగ్లర్ అని బహిరంగంగానే ఆరోపించారు. ఇక ఇతరత్రా అనేక ఆరోపణలు ఆయన మీద ఉన్నాయి. స్థానికంగా అందుబాటులో ఉండరన్న ప్రచారం జరుగుతోంది. అయితే ప్రతి సమావేశంలో ఆయన మూడంటే మూడు మాటలే చెబుతూ 'నేను నాయకుడిని కాదు. మీ సేవకుడిని. మీకు అందుబాటులో ఉంటాను' అని చెప్పి ముగించేస్తున్నారు. ఆయనపై ప్రతిపక్షనేతలు చేసిన ఆరోపణలను ఖండించడం కానీ, సవాల్ చేయడం కానీ జరగ లేదు. లోక్‌సభ పరిధిలోని స్థానిక సమస్యలను కానీ, ఢిల్లీ స్థాయిలో ఆయన వ్యవహరించబోయే తీరును గురించి కానీ ప్రస్తావించడం లేదు. దీంతో ఆయన ప్రసంగంలో పసలేక ఆపార్టీ శ్రేణులే నీరసపడుతున్నాయి.

జగన్ అరాచక పాలనను అంతమొందించాలి

ప్రజలకు టీడీపీ నేతల పిలుపు

పార్టీ కార్యాలయాలు, ఇతర చోట్ల ఘనంగా అంబేడ్కర్ జయంతి

ఇతర వర్గాలూ ఘన నివాళి

ఒంగోలులో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కి రాష్ట్రంలో ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనను అంతమొందించాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీని కూటమిని గెలిపిస్తేనే రాష్ట్రంలో ప్రజలకు భద్రత, హక్కుల రక్షణ ఉంటుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు ఆయా వర్గాల వారు నివాళులర్పించారు. ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల, ప్రకాశం భవన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాలకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

టీడీపీ ఆధ్వర్యంలో..

జిల్లావ్యాప్తంగా టీడీపీ శ్రేణులు అంబేడ్కర్ జయంతిని పెద్దఎత్తున నిర్వహించాయి. పలుచోట్ల ఆపార్టీ తరఫున ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూటమి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. కూటమి కొండపి అభ్యర్థి డీఎస్‌బీవీ స్వామి టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో, సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్ విజయకుమార్ పేర్నమిట్ట, చీమకుర్తి, సంతనూతలపాడులలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆనియోజకవర్గంలోని కనిగిరి, వెలిగండ్ల, సీఎస్‌పురం తదితర ప్రాంతాల్లో ఆపార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. దర్శి పట్టణంలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ ఉమ్మడి అభ్యర్థి దామచర్ల, పార్లమెంట్ అభ్యర్థి మాగుంట

పశ్చిమ ప్రాంతంలోని టీడీపీ కూటమి అభ్యర్థులు, ఇతర నేతలు ఎక్కడికక్కడ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ఆయా వర్గాల అభ్యున్నతి కోసం గతంలో టీడీపీ అమలు చేసిన అనేక పథకాలను అటకెక్కించిందన్నారు. దళితులు, బీసీలకు జగన్ పాలనలో రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఎక్కడ చూసినా భూకబ్జాలు, దౌర్జన్యాలు, ప్రశ్నించిన వారిపై దాడులు, వేధింపులు పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో జగన్ సర్కార్‌కు చరమగీతం పాడితేనే రాష్ట్రంలో ప్రజల హక్కులకు రక్షణ ఉంటుందన్నారు. కాగా వివిధ పార్టీలు, దళిత. ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ ఆయా ప్రాంతాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి.

వచ్చేనెల 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

● ఈనెల 24లోపు రీకౌంటింగ్‌కు దరఖాస్తు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 14 : ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు ఉదయం 9నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయి. విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులతోపాటు అదనపు మార్కులు సాధించేందుకు పాసైన సబ్జెక్టుల్లో బెటర్‌మెంట్‌కు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 18నుంచి 24లోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు మే 1నుంచి 4 వరకు జరుగుతాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం మార్కుల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు విద్యార్థులు ఈనెల 18నుంచి 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి జవాబు పత్రం నకలును పోస్టులో పంపుతారు.

టీచర్ల డిప్యుటేషన్ ఉత్తర్వులు రద్దు

పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 14 : రాష్ట్రంలో ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు, పని సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేస్తూ పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రకారం 2023-24 విద్యా సంవత్సరం చివరి పనిదినమైన ఈనెల 23న ప్రస్తుతం డిప్యుటేషన్, పనిసర్దుబాటులో పనిచేస్తున్న స్థానం నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుంది. అదేరోజు సాయంత్రానికి తమ మాతృస్థానంలో అంటే జీతం పొందుతున్న పాఠశాలల్లో విధుల్లో చేరాలి. ఫారిన్ సర్వీసు నిబంధనలతో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న టీచర్లను మాత్రం రిలీవ్ చేయకుండా యథాతథంగా కొనసాగించాలని ఆ ఉత్తర్వుల్లో డీఈవోలను, ఆర్‌జేడీలను కమిషనర్ ఆదేశించారు.

శీతల పానీయం తాగి చిన్నారులకు అస్వస్థత

● 10మందికి వాంతులు

● హుటాహుటిన ఆసుపత్రులకు తరలింపు



గుంటూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

బల్లికురవ, ఏప్రిల్ 14 : బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడులో శీతల పానీయాలను తాగి పది మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారిని కుటుంబ సభ్యులు వెంటనే గుంటూరు, చిలకలూరిపేటల్లోని ప్రైవేటు వైద్యశాలలకు తరలించారు. అందిన సమాచారం మేరకు.. నక్కబొక్కలపాడు ఎస్సీకాలనీ, గ్రామానికి శనివారం మధ్యాహ్నం శీతల పానీయాలు అమ్మే బండి వచ్చింది. దీంతో చిన్నారులైన గాలి నిత్య, దీక్షితబాబు, జంధ్రాజుపల్లి గ్లోరియా, నిడమనూరి వెంకటసాయి, గోరికపూడి జస్సీ గెల్లా రాహుల్, అక్షర, సహస్ర, గౌతం, అరిపినేని ధనుష్ జ్యూస్ కావాలని గొడవ చేయడంతో తల్లిదండ్రులు వారికి ఆరెంజ్ జ్యూస్‌ని కొనిపెట్టారు. అది తాగిన చిన్నారులు కొద్దిసేపటికే వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. సొమ్మసిల్లి పడిపోవడంతో హుటాహుటిన గ్రామంలో ప్రథమ చికిత్స అనంతరం చిలకలూరిపేట, గుంటూరుకు తరలించారు. చిన్నారులు తాగిన ఆరెంజ్ జ్యూస్ ఫుడ్ పాయిజన్ అయినందువల్ల అస్వస్థతకు గురైనట్లు భావిస్తున్నారు. చిన్నారులను ఐసీయూలో ఉంచి వైద్యం అందిస్తున్నారు. 10 మందిలో నలుగురు కోలుకోవడంతో వారిని ఇంటికి పంపారు.



వీరయ్యచౌదరిని అభినందిస్తున్న మనోజ్ కుమార్

టీడీపీ చీరాల ఎన్నికల సమన్వయకర్తగా వీరయ్యచౌదరి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 14: చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎన్నికల సమన్వయకర్తగా బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి నియమితులయ్యారు. పార్టీ జాతీయ్య అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ముప్పవరపు వీరయ్యచౌదరిని నియమిస్తూ ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెనాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా నాగులుప్పలపాడులో మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జులు విజయ్‌కుమార్, పాండురంగారావు, మురళీ తదితరులు ముప్పవరపు వీరయ్యచౌదరిని అభినందించారు. చీరాల నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్య విజయానికి కృషి చేస్తానని వీరయ్యచౌదరి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పర్చూరులో వలసల జోరు

» వైసీపీ నుంచి టీడీపీలోకి క్యూకడుతున్న వైనం
» ఏలూరి సమక్షంలో పార్టీలోకి చేరుతున్న శ్రేణులు
» యద్దనపూడిలో సైకిల్ ఎక్కిన వైసీపీ నేతలు



ఏలూరి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఏఎంసీ వైస్ చైర్మన్ రమేష్, పార్టీలో చేరిన వైసీపీ నాయకులతో ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 14 : యద్దనపూడి మండలంలోని వైసీపీ ప్రజా ప్రతినిధులు సీనియర్ నేతలు సైకిల్ ఎక్కారు. తెలుగు దేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో వైసీపీ నేతలు భారీ ఎత్తున ఆదివారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రజకు అనునిత్యం అందుబాటులో ఉం టూ నిజయోజకాభివృద్ధికి కృషి చేస్తున్న ఏలూరికి ప్రజలకు పార్టీలకు అతీతంగా బ్రహ్మారథం పడుతున్నారు. దీంతో అధికార వైసీపీ నుంచి రోజు రోజుకు వలస జోరుతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే చినగంజాం మండల వ్యాప్తంగా అనేక గ్రా మాల నుంచి వేల సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. తాజాగా యద్దనపూడి మండలానికి చెందిన వైసీపీ నేతలు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరడం రెండు మండలాల నుంచి అఖండ మెజార్టీ ఖాయమన్న ప్రచారం జోరుగా సాగుతుంది. పూనూరు సొసైటీ అధ్యక్షుడు పావులూరు శ్రీనివాసరావు, యద్దనపూడి సొసైటీ అధ్యక్షుడు చింతపల్లిపాడుకు చెందిన వైసీపీ సీనియర్ నేత గోరంట్ల సాంబశివరావు, గన్నవరం ఎంపీటీసీ సభ్యుడు గొట్టిపాటి సతీష్ కుమార్, గన్నవరం వైసీపీ నేతలు నర్రా పాపారాయుడు, సోమేపల్లి స్వాములు, డగుటూరు శ్రీధర్, నర్రా శ్రీనివాసరావు, చెరుకూరి నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీహరిరావు, వేణుబాబు, సోమేపల్లి వీరాస్వామి, నర్రం వెంకటేశ్వర్లు, మున్నంగివారిపాలెం సీనియర్ నేత అనిల్ కుమార్‌తో పాటు పార్టీ శ్రేణులు టీడీపీలో చేరారు.

పూనూరుకు చెందిన సయ్యద్ ఉమ్మర్, షేక్.కాలేషా, షేక్ బాజీవలి, బాబు, షేక్.హుస్సేన్, షేక్ భూరాన్, సయ్యద్ బాల సైదా, మర్రిపాలెం సుబ్బారావు, కాకాని వీరాంజనేయులు టీడీపీలో చేరారు.

చెరుకూరు గ్రామంలోని వైసీపీ నేతలు ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారిలో షేక్ ఇమ్రాన్, షేక్ కరిముల్ల, షేక్ ఖాశీం, హాజహాన్, షేక్ ముంజురుల్లా, షేక్ బుడా, షేక్ సుబానీ, బాజీ, నాగూర్, మహబూబ్ బాషా, వందు ఉన్నారు. పర్చూరుకు చెందిన వైసీపీ నాయకులు ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణంశెట్టి రమేష్, కోటా మధుతో పాటు, గ్రామానికి చెందిన ఎస్టీ వాసులు టీడీపీలో చేరారు. వీరికి ఏలూరి సాంబశివరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేత లు దూళిపల్లి వెంకటస్వామి, గడ్డిపాటి శ్రీనివాసరావు, కఠారి దుర్గా ఉన్నారు.

మార్టూరులో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన ఏఎంసీ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్

మార్టూరు : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన జాష్టి బ్రదర్స్ వైసీపీని వీడి టీడీపీ చేరారు. వారంతా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో సైకిల్ ఎక్కారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జాష్టి వెంకటనారాయణ (పెదబాబు) అతని భార్య, ఎంపీటీసీ సభ్యులు హేమలత, సోదరుడు మాజీ సర్పంచ్ జాష్టి గోపాల కృష్ణ (చినబాబు) సర్పంచ్ గర్నెపూడి కోటమ్మ తమ వర్గీయులతో వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం జాష్టి వెంకట నారాయణ స్వగృహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏలూరి సాంబ శి వరావు వచ్చారు. ఆయనకు జాష్టి సోదరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారిద్దరితోపాటు, వారి అనుచరులను పార్టీలోకి ఆహ్వానిస్తూ ఏలూరి కండువాలను వేశారు. వాస్తవంగా వైసీపీలో ఉన్న జాష్టి వెంకటనారాయణ కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుటుంబానికి సన్నిహితుడిగా ఉన్న వెంకటనారాయణ వైసీపీ నుంచి దగ్గుబాటి వైదొలిగిన తర్వాత స్తబ్దతగా ఉన్నారు. దగ్గుబాటి కుటుంబంతో సాన్నిహిత్యం, ఎమ్మెల్యే గొట్టిపాటితో ఉన్న పరిచయాల మేరకు ఏలూరికి మద్దతుగా పార్టీలో చేరినట్లు జాష్టి చెప్పారు. వారితోపాటు ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమెర వెంకటేశ్వర్లు, పంచాయతీ మెంబర్లు కొమెరవల్లి చిన్నబ్బాయి. చాటగడ్డ బ్రహ్మదేవి, గోపతోటి వెంకటేశ్వర్లు, నల్లపనేని రంగారావు, నాగండ్ల దేవి, తాటి లక్ష్మి, బండి సుబ్బాయమ్మ, తన్నీరు మహాలక్ష్మి, గోపతోటి నాగేశ్వరరావుతో పలు కుటుంబాలు చేరారు.



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన జాష్టి బ్రదర్స్

మార్టూరు మాజీ సర్పంచ్ పార్టీలో చేరిక

మార్టూరు మాజీ సర్పంచ్ కేశావతు దేవుని దయానాయక్ తన వర్గీయులతో ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ యనతో పాటు కిలావతు చంద్రలాల్, భటిక్యా లోక్ నాయక్, కిలావతు చందునాయక్, భూక్యా హనుమానాయక్, భూక్యా సుబ్బారావు నాయక్, మాడావతు నాగేశ్వరరావు నాయక్ తదితరులు పార్టీలో చేరారు. అదేవిధంగా మార్టూరులోని మైనారిటీలు మహమ్మద్ అయ్యూబ్, షేక్ రియాజ్, మాబు సుభాని, షేక్ కాలేషా వలి, ముల్ల అషాద్, పఠాన్ జానీ బాషా పార్టీలో చేరారు.



ప్రచారం నిర్వహిస్తున్న దారు నాయక్

గిరిజన ద్రోహి జగన్

టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్

అదుసుమల్లి(పర్చూరు), ఏప్రిల్ 14: గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్ అన్నారు. పర్చూరు మండలం అడుసుమల్లి, భూషాయపాలెం గ్రామాల్లోని తాండాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి తాండా వాసులను సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమాన్ని జగన్‌రెడ్డి విస్మరించారన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ నాయకుడు ఇండ్ల శ్రీనివాసరావు, పర్చూరు నియోజకవర్గ నాయకులు పాలపర్తి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కారుమంచి కృష్ణ, మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్ బాబు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

మేదరమెట్ల, ఏప్రిల్ 14 : ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలంతా సహకరించాలని కొరిశపాడు ఎస్ఐ శివయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని రాచపూడి, పమిడిపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఘర్షణలు, గొడవలు చేసినా రౌడిషీట్ తెరుస్తామన్నారు. సభలు, సమావేశాల నిర్వహణ, మైకులు పెట్టుకోవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



బీసీలనుద్దేశించి మాట్లాడుతున్న ఏలూరి

టీడీపీలోకి బీసీలంతా రావాలి

ఏలూరి పిలుపు

మార్టూరు, ఏప్రిల్ 14 : బీసీల ఆత్మ గౌరవానికి విలువనిచ్చే తెలుగుదేశం పార్టీలోకి రావాలని బీసీ కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మార్టూరులో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. బీసీ రాష్ట్ర నాయకుడు గుంజి వెంకట్రావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఏలూరి మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత బీసీలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేసి, అండగా ఉంటామన్నారు. జగన్‌రెడ్డిపై రాయి దాడి కుట్రలో భాగమన్నారు. నాడు కోడి కత్తి.. నేడు రాయి డ్రామాతో మరో అమాయకుడిని బలిపశువును చేసేందుకు వ్యూహం పన్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కోసం పాటు పడే ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. గౌరవం లేని చోట ఉండవద్దన్నారు. ప్రజల ఆత్మ గౌరవానికి విలువ నిచ్చే చంద్రబాబు పాలనకు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మీరిచ్చే విజయంతో దుర్మార్గ పాలన అంతం కావాలన్నారు. కార్యక్రమంలో గుంజి వెంకట్రావు, శివరాత్రి శ్రీను, పోలూరి సింగయ్య, ఉప్పు గురవయ్య పల్లపు అంకమ్మ రావు, మండల నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్, తాటి నాగేశ్వరావు, మహిళా నేతలు రమాదేవి, రాధ పాల్గొన్నారు.

టీడీపీలో చేరికల జోష్

చినగంజాం : చినగంజాం మండలంలో టీడీపీలో చేరికలు జోష్‌గా కొనసాగుతున్నాయి. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని వైసీపీకి చెందిన వార్డు మెంబర్లు, మసీదు పేట, అంబేద్కర్‌నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ వార్డు మెంబరు షేక్ నబీషా ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు గేరా ఆషా, మార్పు సుకుమార్, మసీదుపేట, అంబేద్కర్‌నగర్‌లకు చెందిన 40 కుటుంబాలకు చెందిన ముస్లింలు, ఎస్సీలు పార్టీలో చేరగా ఎమ్మెల్యే ఏలూరి వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్‌కలాం అజాద్, షేక్ ఖాదర్ బాషా, షేక్ సలాం పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన పరిటాలవారిపాలెంవాసులు

రాక్షస పాలనలో బీసీలపై పెరిగిన దాడులు

ఎమ్మెల్యే గొట్టిపాటి

సంతమాగులూరు, ఏప్రిల్ 14 : వైసీపీ రాక్షస పాలనలో బీసీపై దాడులు పెరిగాయని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. సంతమాగులూరు మండలంలోని పరిటావారిపాలెం గ్రామంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన 30 కుటుంబాలకు చెందిన పుట్టా రామాంజీ,గుంటూరు హనుమంతరావు గుంటూరు రవి, చెవుల చంద్రయ్య, పాత కోట రమజాన్, యేసు దానం, నూకల అంకమ్మారావు, చిలువేరి వేంకటేశ్వర్లు, నూకల వీరయ్య, కుందుర్తి మొగలయ్య, చిలువేరీ వీరంజి, గుంటూరు ప్రసన్న, బోదడ శ్రీనివాసరావు, కమతం వీగయ్య, కుందుర్తి చిన అంజయ్య కమతం రవి, బుల్లయ్య, బడుగు ఇసాక్, నూకల వీరంజీ, కుందుర్తి ఆంజనేయులు, కందుల వేంకటేశ్వర్లు, పాత కోట ఆంజనేయులు, నూకల శ్రీను వైసీపీని వీడి ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీ చేరారు.

ఉచిత బస్సు ప్రయాణం.. మూడు గ్యాస్ సిలిండర్లు

హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

సంతమాగులూరు : ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తుందని కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ ప్రజలకు వివరించారు. సంతమాగులూరు మండలం సజ్జాపురంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి స్థానిక ప్రజలతో ముచ్చటించిన ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించి, ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఏటా ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఆడబిడ్డ నిధి ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు ప్రతినెలా రూ.1500, తల్లికి వందనం ద్వారా ప్రతి ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు అందజేస్తారని తెలిపారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తేలప్రోలు రమేష్, చేవూరి వాసిరెడ్డి, కంచేటి మురళి, గంధ్రు అంకమ్మరావు, గొట్టిపాటి అజయ్, గంధ్రు గోవిందు, గడిపూడి శేషయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

యువనేత కమల్‌కిషోర్ ఇంటింటి ప్రచారం



ముక్తేశ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్న బాబీ

బల్లికురవ, ఏప్రిల్ 14 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సకాలంలో అమలు జరుగుతాయని నియోజకవర్గ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) అన్నారు. ఆదివారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ఎమ్మెల్యే రవికుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే రూ.4వేలకు పింఛన్ పెంచుతున్నట్లు తెలిపారు. నిరుద్యోగులను ఆదుకోవడంతోపాటు అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడేలా పథకాలను రూపొందించారని వివరించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొండేటి ఇజ్రాయల్, అట్లూరి నాగేశ్వరరావు, శింగంశెట్టి సుబ్బారావు, చెన్నూరి నాగార్జున, ప్రసాద్, నాగండ్ల హనుమంతురావు, అడపాల బసవయ్య, బైలడుగు శివయ్య, కోటయ్య వెంకటేశ్వరరావు, నాగి శెట్టి చిరంజీవి పాల్గొన్నారు.

వీఆర్వో కుటుంబానికి ఆర్థిక సాయం

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 14 : యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి వీఆర్వో కాలేషావలి విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. అతని కుటుంబానికి కలెక్టరు పంపిన రూ.2లక్షల ఆర్థిక సాయం చెక్కును ఆదివారం ఆర్డీవో గంధం రవీందర్ కాలేషావలి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



చీరాల, మార్టూరు, మేదరమెట్లలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థులు కొండయ్య, ఏలూరి, గొట్టిపాటి

పలువురు వక్తల ఉద్ఘాటన.. నివాళి

చీరాల, ఏప్రిల్ 14 : భారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పిలునిచ్చారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ముక్కోణపు పార్క్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో

ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, ఎంఎం కొండయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రా జ్యాంగపరమైన హక్కులను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నా రు. అందుకు అనుగుణంగా చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నాతాని ఉమామహేశ్వరరావు, సజ్జా వెంకటేశ్వరరావు, పార్టీల నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరి నివాళి

మార్టూరు : నేతాజీనగర్, రామ్‌నగర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు శ్రేణులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనవెంట గొట్టిపాటి వెంకట్రావు, కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణ, కమ్మ శివ నాగేశ్వరరావు, రాంబాబు, తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్ అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జేడీ శీలం, ఏలూరి కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. జేడీ అంబేడ్కర్‌కు నివాళులర్పించి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఏలూరిని చూసి పలుకరించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శివసాయిశ్రీలక్ష్మీ జ్యోతి అందరూ ఉండడం చూసి కారు దిగకుండానే వెళ్లిపోయారు.

మేదరమెట్లలో..

మేదరమెట్ల : రాష్ట్రంలో దళితులను వేధించి, వారి మరణానికి కారణమైన దళిత ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని సోమవరప్పుడు ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మన్నె రామారావుతో పాటు ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో

వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో శ్రేణులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్, మాజీ ఎంపీ చిమటా సాంబు తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ తన అనుచరులతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

పంగులూరులో..

పంగులూరు: డాక్టర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు అన్నారు. ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలిన రామసుబ్బారావు, కేవీ సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, వీరరాఘవయ్య, మాజీ సర్పంచ్‌లు ఉన్నం రవిబాబు, అమృతపూడి ఏసోబు, పార్టీ ప్రధాన కార్యదర్శి తెలగతోటి రాధాకృష్ణ, గరిమిడి జగన్, వెంకటరావు, వాసంతు, పుష్పరాజు, సిమోస్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : సినిమాహాలు కూడలి, అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బోడాల శ్యాంసుందర్, రామకృష్ణ, సుందరరావు, దాసు, సురేష్‌బాబు, రాజేష్, బాబర్‌బాషా, హనుమయ్య, రఫీ, వెంకటేశ్వర్లు, శ్రీను, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చినగంజాంలో..

చినగంజాం : అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొదవీరయ్య, సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు రాయని ఆత్మారావు, అజాద్, చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, తాటి రాజశేఖర్, నరహరి శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, షేక్ హుస్సేన్ బాషా, పర్వతరెడ్డి పార్థసారథి, చేవూరి రవణమ్మ, షేక్ బాజీ, తుమ్మలపెంట చిన్నా, గంటా వెంకటనారాయణ, గుండ్రెడ్డి నరసింహారావు, దుర్గారావు, ఏసునారాయణ, ఎస్.సూరిబాబు, ఎం.షద్రక్, జనసేన సీనియర్ నాయకులు తోట ఆశోకచక్రవర్తి పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ : అంబేడ్కర్ జయంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, ఎస్ఎల్ గుడిపాడులో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు పత్తిపాటి నాగయ్య, సురభి రామారావు, కందుకురు పేతురు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్‌లో..

అద్దంకిటౌన్ : అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ క్రమంలో అద్దంకిలోని బంగ్లారోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, అద్దంకి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్‌బాబు నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక నాయకులు జ్యోతి రమేష్‌బాబుతోపాటు పలు సంఘాలు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న వైసీపీ అభ్యర్థి వెంకటేష్, పంగులూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

అందరికీ సమప్రాధాన్యం

» గెలుపే లక్ష్యంగా పనిచేయండి
» కూటమి అభ్యర్థి కొండయ్య



కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన చల్లారెడ్డిపాలెంవాసులు

చీరాల, ఏప్రిల్ 14 : పార్టీలో ఎప్పుడు చేరామన్నది ముఖ్యం కాదు. పార్టీ కోసం ఎంత పని చేశామన్నదే ముఖ్యమని.. అలాంటి వారికి సమ ప్రాధాన్యత ఉంటుందని కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం జిల్లా రైతు విభాగ కార్యదర్శి కీర్తి వెంకటేశ్వర్లు, చల్లారెడ్డిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కీర్తి పూర్ణల ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని జగన్నాథపురానికి చెందిన 40 కుటుంబాలు కొండయ్య వైసీపీని వీడి టీడీపీ సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌరీ అమర్‌నాథ్, నాతాని ఉమామహేశ్వరరావు, గొర్ల రాముడు, గంజి పురుషోత్తమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిధిలోని చీరాల నగర్‌కు చెందిన పలువురు శనివారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీర్లంకారెడ్డి, సోమయ్య ఆధ్వర్యంలో కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో దొంతిబోయిన ఏడుకొండలరెడ్డి, పుట్టా సంతోష్‌రెడ్డి, పుట్టా వెంకటేశ్వరరెడ్డి, తిరుమలరెడ్డి, ఆసాది స్వామిరెడ్డి, రమేష్, మద్దిబోయిన కోటయ్య, గవిని ముషలయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మవారి ఆత్మీయసమావేశంలో..

కమ్మవారి ఆత్మీయ సమావేశంలో అభ్యర్థి కొంయ్య టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ సామాజికవర్గంతో తన కున్న అనుబంధాన్ని వివవరించారు. అనంతరం కార్యక్రమ నిర్వహకు లు కొండయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రతినిధులు నాతాని ఉమామహేశ్వరరావు, గౌరీఅమర్‌నాథ్, రాఘవయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ రా జేంద్రప్రసాద్, పోగడదండ రవికుమార్, శివరామప్రసాద్, పద్మిని, నిర్వాహకులు పాల్గొన్నారు.

మండలంలోని దేవాంగపురి పంచాయితీ పరిధిలో ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌తో ప్రయోజనాలను వివరించారు. తరువాత మున్సిపల్ పరిధిలోని 29వ వార్డులో ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. రాత్రికి దంతంపేటలో జరిగిన చేనేత ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



టీవీని బహూకరిస్తున్న క్లబ్ సభ్యులు

ఎన్టీఆర్ లైబ్రరీకి టీవీ బహూకరణ

కొంకొల్లు, ఏప్రిల్ 14 : మండలంలోని పూసపాడులోని ఎన్టీఆర్ లైబ్రరీ ఆడిటోరియానికి రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ ఆధ్వర్యంలో కొమ్మాలపాటి కుటుంబ సభ్యుల సహకారంతో ఎల్ఈడీ టీవీని బహూకరించారు. క్లబ్ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ రాజగోపాల్ అధ్యక్షతన ఆడిటోరియం సభ్యులైన గ్రామ సర్పంచ్ ఘంటాబాబు, కరణం రమేష్, యార్లగడ్డ రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, పూర్ణ, మండవ సహదేవరావుకు సీపీఐ రాష్ట్రనాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, దామచర్ల శ్రీనివాసరావు, మద్దినేని సుధాకరరావు అందజేసారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పొంకల సుబ్రమణ్యం, సరిపూడి అనిల్, నవీన్ చక్రవర్తి, ఏటుకూరి రత్న, ఏనుగుల రమణబాబు, యలమంచిలి వేణు, ఏడుకొండలు, వి.సురేష్, బోయపాటి ప్రభాకర్, మురళీకృష్ణ, ఎం.వీరయ్య పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 14 : రౌడీషీటర్లపై పోలీస్ నిఘా నిరంతరం కొనసాగుతుంది. ఎవరు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ వద్ద స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో సాధారణ జీవితం గడపాలని సూచించారు. ఉద్రేగాలకు, కోపాలకు, ప్రలోభాలకులోనే చట్టవ్యతిరేక కార్యకలాపలకు పాల్పడి జైలు పాలైతే ఇంటి వద్ద ఉన్న కుటుంబ సభ్యులు పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినా చట్టప్రకారం శిక్షార్హులు అవుతారన్న విషయాన్ని మదిలో ఉంచుకుని మసలుకోవాలని సున్నితంగా, సూటిగా చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పర్చూరు, ఏప్రిల్ 14: పర్చూరులోని డిగ్రీ కళాశాలలో శంకర్ వైద్య శాల, చిన్మయ మిషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున రోగులు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. రోగులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా నిర్వాహకులు పాబోలు ఉదయ భాస్కర్ నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డాక్టర్ శ్యాందేవ్, డాక్టర్ చెందులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమం లో పాబోలు గిరిజా కుమారి, కొత్తూరి వెంకటేశ్వరరావు, రావి సత్యన్నారాయణ, కఠారి సత్యం, ఒగ్గిశెట్టి నరిసింహం, కాసా అజేయ్, తాటి లింగేశ్వరరావు, కొసనా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాదాత రాధాకృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం


పర్చూరు, ఏప్రిల్ 14 : నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు నందించిన స్వర్గీయ పాబోలు రాధాకృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర నంది అవార్డ్ గ్రహీత కారుమూరి సీతారామయ్య అన్నారు. పర్చూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం రాధాకృష్ణమూర్తి కాంస్య విగ్రహావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కారుమూరి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలన్న సంకల్పంతో క్రిష్ణంశెట్టి కనకయ్య సారథ్యంలో విద్యా సంస్థల ఏర్పాటుకు రాధాకృష్ణమూర్తి అందించిన తోడ్పాటు హర్షనీయమన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తుల సేవలను గౌరవించడం అభినందనీయం అన్నారు. రాధాకృష్ణమూర్తి విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన పాబోలు ఉదయ భాస్కర్, గిరిజా కుమారి దంపతులను వక్తలు అభినందించారు. కార్యక్రమంలో షేక్ అహ్మద్‌బాషా, ఒగ్గిశెట్టి నరసింహం, మామిడిపాక హరిప్రసాద్, క్రిష్ణంశెట్టి రమేష్, బీరం సుందరావు, క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, మంగళగిరి కోటేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, కొల్లా హనుమంతురావు పాల్గొన్నారు.



రాధాకృష్ణమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీతారామయ్య

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

సోమవారం 15 ఏప్రిల్ 2024

ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.2	28.2
కావలి	36.0	25.0
కందుకూరు	37.0	26.0
ఆత్మకూరు	39.0	27.0
ఉదయగిరి	39.0	24.0

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారానికి ప్రాజెక్టులో 8.622 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 320, డెల్టాకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆయన గొప్పేంటో..?

అతనొక సాధారణ కాంట్రాక్టర్... చిన్న చిన్న పనులు చేసుకునే వాడు... ఆ వ్యక్తికి రూ.1400 కోట్లకు పైగా విలువ చేసే పనులు అప్పగించారు..! వినడానికి నమ్మశక్యంగా లేకపోయినా ఇది నిజం. పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో ఈ కాంట్రాక్టర్‌కు భారీగా దోచిపెట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ చిన్న కాంట్రాక్టర్‌కు అంత పెద్దమొత్తంలో పనులు ఎలా అప్పగించారయ్యా.. అని ఆరా తీస్తే తెరవెనుక వైసీపీ పెద్దలు, అఖిల భారత సర్వీసు అధికారులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



వెంకటేశ్వరపురం లేఅవుట్‌లో పునాదుల దశలోనే ఆగిపోయిన ఇళ్లు

- అనామక వ్యక్తికి 78 వేల ఇళ్లు అప్పగింత
- తూతూమంత్రంగా నిర్మాణం
- నెల్లూరులోనే రూ.120 కోట్ల చెల్లింపులు
- అధికారులకు బినామీగా ఆ కాంట్రాక్టర్..?
- ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు ఫండింగ్

నెల్లూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే కంపెనీకి 52 వేల ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించడంతో అది రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద దుమారాన్నే రేపింది. అయితే ఆ ఎమ్మెల్యేకు మించి ఇళ్లను అనంతసాగరం మండలానికి చెందిన కాంట్రాక్టర్‌కు అప్పగించడం గమనార్హం. ఇప్పటి వరకు ఆ కాంట్రాక్టర్ నిర్మించిన ఇళ్లను పరిశీలిస్తే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతుంది. ఆ కాంట్రాక్టర్ నిర్మించిన ఇళ్లకు, చెల్లించిన బిల్లులకు అసలు పొంతనే లేదు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఇప్పటి వరకు సుమారు రూ.120 కోట్లను సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు అధికారుల లెక్కలు చెబుతుండడం విశేషం.

ప్రజాధనం దోపిడీ

వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఏ మూల కూర్చున్నా ఒకటే.. అన్న సామెత హౌసింగ్ శాఖలో హవా ప్రదర్శిస్తున్న ఆ కాంట్రాక్టర్‌కు సరిపోతుంది. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా అధికారులు, వైసీపీ నేతలు, కాంట్రాక్టర్లు పేదల ఇళ్ల మాటున ప్రజాధనాన్ని దోచుకుతింటున్నారు. రూ. వందల కోట్ల ప్రజాధనాన్ని చెల్లిస్తున్నా పేదలకు మాత్రం సొంత ఇంటి కల నెరవేరడం లేదు. జగనన్న లేఅవుట్లు అనేవి కాలనీలు కాదని, ఊళ్ల నిర్మాణం జరుగుతోందని స్వయంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. కానీ జిల్లాలో ఎక్కడ ఊరు ఏర్పడిందో కూడా ఆయనే చెప్పాలి. జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లల్లో పేదలు ఒక్కపూట కూడా నివాసం ఉండలేని విధంగా పరిస్థితులు ఉన్నాయి. లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్న ఇళ్లు మినహాయిస్తే ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లు అవినీతికి కేరాఫ్‌గా నిలుస్తున్నాయి.

పూర్తయింది 21,695 ఇళ్లు మాత్రమే

జిల్లాలో మొత్తం 97,101 ఇళ్లను మంజూరు చేశారు. అందులో ఇప్పటి వరకు 9,092 ఇళ్లు అసలు ప్రారంభమే కాలేదు. 28,271 ఇళ్లు బేస్ స్థాయి కన్నా దిగువనే ఉండగా, మరో 19,255 ఇళ్లు బేస్ స్థాయిలో ఉన్నాయి. 6,323 ఇళ్లు రూఫ్ లెవల్‌లో, 12,399 ఇళ్లు రూఫ్ కాంక్రీట్ లెవల్‌లో ఉండగా 21,695 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఈ పూర్తయిన ఇళ్లలో దాదాపు 12 వేలకు పైగా ఇళ్లు సొంత స్థలాల్లో నిర్మించినవే ఉన్నాయి. అచ్చంగా జగనన్న లేఅవుట్లలో 63,135 ఇళ్లను మంజూరు చేయగా అందులో సుమారు 10 వేలు మాత్రమే నిర్మాణం జరిగినట్లు అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది.

ఎన్నికలకు పేదల సొమ్ము

అనంతసాగరం మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 78 వేల ఇళ్లను అప్పగించారు. సదరు ఆ కాంట్రాక్టర్ మూడు పేర్లతో ఈ మొత్తం ఇళ్లను తీసుకున్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 7,680 ఇళ్లను తీసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ ఈ కాంట్రాక్టర్ జిల్లాలో వెయ్యి వరకు ఇళ్లను పూర్తి చేయగా, అందుకు సుమారు రూ.120 కోట్ల వరకు చెల్లింపులు చేశారు. సదరు కాంట్రాక్టర్ నెల్లూరు వెంకటేశ్వరపురంలో నిర్మించిన ఇళ్లను పరిశీలిస్తే.. చుట్టూ గోడలు నిర్మించి పూతలు వేసి పూర్తి చేసినట్లుగా చూపించారు. లోపల మాత్రం పూతలు, దళం వేయకుండా వదిలేశారు. కొన్ని ఇళ్లు అసలు పునాదులు కూడా దాటలేదు. అయినప్పటికీ ఆ కాంట్రాక్టర్‌కు రూ.వందల కోట్ల బిల్లులు చెల్లించారు. ఈ కాంట్రాక్టర్ వెనుక వైసీపీ పెద్దలు, ఉన్నతాధికారులు ఉన్నట్లు హౌసింగ్ శాఖలో ప్రచారం జరుగుతోంది. గతంలో హౌసింగ్ శాఖకు ఉన్నతాధికారిగా పనిచేసిన ఓ అధికారి కుటుంబ సభ్యులు జిల్లాకు చెందిన వారు కావడం, వారి ద్వారా సదరు ఉన్నతాధికారికి పరిచయం కావడంతో ఉన్నతస్థాయిలో సదరు కాంట్రాక్టర్‌కు పలుకుబడి పెరిగిందని చెప్పుకుంటున్నారు. అదే సమయంలో జిల్లాలోని కొందరు అధికారులకు కూడా ఆ కాంట్రాక్టర్ అన్ని అవసరాలు తీరుస్తున్నారని, ఈ కారణంగానే ఇళ్ల నాణ్యతను కూడా పరిశీలించకుండానే ఇష్టానుసారం బిల్లులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల ప్రచారాలు జరుగుతుండడంతో ఆ కాంట్రాక్టర్ పలువురు వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఫండ్ కూడా ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నారు.



నెల్లూరు వెంకటేశ్వరపురం లేఅవుట్లో ప్లాస్టింగ్, దళం లేకుండా నిర్మించిన ఇల్లు

ఇళ్లు నిర్మించకనే బిల్లులు..

లేఅవుట్లలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ఆప్షన్-3ను తీసుకొచ్చింది. దాదాపు సగం మందికిపైగా లబ్ధిదారులు ఈ ఆప్షన్‌ను ఎంచుకున్నారు. దీంతో హౌసింగ్ అధికారులు ఇళ్ల నిర్మాణ బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించారు. సాధారణంగా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించేటప్పుడు టెండర్లు పిలవాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు. అధికారులు, వైసీపీ నేతలు ఎంచుకున్న వారే కాంట్రాక్టర్లు అయ్యారు. జిల్లాలో సుమారు 30 వేల ఇళ్లను 180 మంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. లబ్ధిదారుడికి చెల్లించే రూ.1.80 లక్షలను ఆ కాంట్రాక్టర్‌కు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో ఇళ్లు నిర్మించడం కష్టమని కాంట్రాక్టర్లు అడ్డం వేసి లబ్ధిదారుల నుంచి అదనంగా రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారు. ఇలా మూడేళ్లలో ఈ కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లు ఎన్నయ్యా అంటే.. ఆరు వేలు కూడా లేవు. ఇప్పటి వరకూ జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.767 కోట్లను చెల్లించగా, అందులో మెజారిటీ పేమెంట్‌ను కాంట్రాక్టర్లకు చెల్లించారు. చాలా చోట్ల ఇళ్లను పూర్తిగా నిర్మించకుండానే కాంట్రాక్టర్లు పూర్తి బిల్లులు తీసేసుకున్నారు. పైకి ఇళ్లు పూర్తి చేసినట్లు చూపించి లోపల కనీసం దళం కూడా వేయకుండా వదిలేశారు. ఈ ఇళ్లలో పేదలు ఎలా నివాసం ఉండాలో అధికారులే సమాధానం చెప్పాలి.



నెల్లూరు వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, తదితరులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (వీఆర్సీ) ఏప్రిల్ 14: అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధన కోసం జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నదని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నెల్లూరు వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సమాన హక్కులు కలిగి ఉండాలని సంకల్పించిన అంబేడ్కర్ దేశప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ప్రపంచ దేశాల్లో దేశఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చాక దేశప్రజలంతా అన్ని హక్కులతో స్వేచ్ఛగా జీవించడానికి ప్రధాన కారణం అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగమేనని ఆయన తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కులమత, జాతి, లింగవివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన గొప్ప దార్శనికుడు అంబేడ్కర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎస్ లవన్న, ఐటీడీఏ పీవో డాక్టర్ రాణి మందా, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, హౌసింగ్ పీడీ నాగరాజు, మైక్రోఇరిగేషన్ పీడీ శ్రీనివాసులు బలసాని, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సమాచార శాఖ డీడీ సదారావు తదితరులు పాల్గొన్నారు.

చదువు చెబుతున్నారా.. బాతాఖానీ చేస్తున్నారా ?

- ప్రభుత్వ జూ.కళాశాల లెక్చరర్లపై తల్లిదండ్రుల ఆగ్రహం
- జూ. ఇంటర్‌లో 43 మందికిగాను ఒక్కరే పాస్
- నాడు ఎంతో మంచి పేరు... నేడు హీనస్థితి

చేజర్ల, ఏప్రిల్ 14 : మండల కేంద్రమైన చేజర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి సుమారు 20 సంవత్సరాలు అయింది. ప్రారంభించిన కొత్తల్లో ఈ కళాశాల అంటే చుట్టుపక్కల మండలాల్లో ఎంతో మంచి పేరుండేది. ఇంటర్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. ఒకరిద్దరు విద్యార్థులు స్టేట్ ర్యాంకు కూడా సాధించారు. ఇదంతా గతం. ప్రస్తుతం ఈ కళాశాల అంటేనే విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు నిదర్శనం... మూడు రోజుల క్రితం విడుదలైన ఇంటర్ ఫలితాలే.

ఒక్కరే పాస్

ఈ ఏడాది కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 45 మంది పరీక్ష రాయగా, ఒక్కరంటే ఒక్కరే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 27 మంది విద్యార్థులకుగానూ 13మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది కొంతవరకు ఉత్తీర్ణతశాతం పెరిగినా, కరోనా సమయంలో ఒక్కరు కూడా ఉత్తీర్ణత కాలేదు. ప్రస్తుతం కొంతమేర అయినా ఉత్తీర్ణత సాధిస్తారని ఆశించినా మళ్లీ అవే ఫలితాలు రావడంతో లెక్చరర్లపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసలేం చేస్తున్నారు...?

అసలు కళాశాలలో పిల్లలకు అధ్యాపకులు చదువు చెబుతున్నారా ? లేక రోజూ వచ్చి బాతాఖానీ చేసుకు పోతున్నారా ? అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తమ పిల్లలను ప్రైవేటు కళాశాలలో చదివించే స్తోమత లేక, దాతల సహాయంతో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేస్తే ఒక్క పూట అన్నం ఖర్చైనా తగ్గుతుందని ప్రభుత్వ కళాశాలకు పంపిస్తున్నామని, అయితే ఈ ఫలితాలు చూసి చదువులు మాన్పించుకోవాలని అనిపిస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల మండల కేంద్రానికి దూరంగా ఉండడం, అదీ కాక కళాశాలపై అజమాయిషీ కొరవడంతో విద్యార్థులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధ్యాపకులు సరిగా బోధన చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, మెరుగైన ఫలితాలు సాధించాలే చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



చేజర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆర్భాటమే.. 'ఆసరా' ఏదీ ?

అధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మహిళల ఖాతాల్లో మాత్రం నగదు జమకాలేదు. కులం, మతం, ప్రాంతం చూడం.. అని ఘనంగా చెప్పుకునే సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆసరా నగదు జమ విషయంలో కులాలవారీ వివక్షకు తెరలేపారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది. అందరికులం పేదకులమే అయినా, ఇక్కడ కూడా వివక్ష చూపటం తగునా? అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

- చెక్కులు ఇచ్చారు.. నగదు మరిచారు !
- నెలలు గడుస్తున్నా నేటికీ జమకాని డబ్బు
- సొమ్ముల పంపిణీలోనూ వివక్ష

కందుకూరు, ఏప్రిల్ 14 : పొదుపు గ్రూపుల రుణాలను మాఫీ చేస్తున్నట్లు గత ఎన్నికల ముందు ప్రకటించిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక రుణ బకాయిలు మీరు చెల్లిస్తే ఆ మొత్తాన్ని విడతల వారీగా మహిళల ఖాతాలకు జమచేస్తానని మాటమార్చారు. రుణ బకాయిలను వైఎస్ఆర్ ఆసరా పేరుతో నాలుగు విడతలుగా మహిళల ఖాతాలకు జమచేస్తున్న విషయం తెలిసిందే.ఈ ఏడాది ప్రారంభం నుంచి నాల్గవ విడత బకాయిల చెక్కులను ఆర్భాటంగా అన్నీ మండల కేంద్రాలలో బహిరంగ సభలు ఏర్పాటుచేసి పంపిణీ చేశారు.ఈ బహిరంగ సభల నిర్వహణ కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేయటమే గాక పొదుపు గ్రూపుల్లోని వేలాదిమంది మహిళలు వ్యయప్రయాసల కోర్చి చెక్కుల పంపిణీకి హాజరయ్యారు. అయితే అప్పటినుంచి నగదు కోసం పొదుపు గ్రూపు మహిళలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించటం లేదు. బ్యాంకు ఖాతాలకు నగదు జమకాలేదని బ్యాంకర్లు చెబుతుండగా, వీవోఏలను సంప్రదించాలని మండల స్థాయి వెలుగు అధికారులు, మా పరిధిలో ఏమీ లేదని వీవోఏలు సమాధానమిస్తుండటం గమనార్హం.

జమ కావాల్సింది రూ. 54 కోట్లుపైనే..

కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మున్సిపాలిటీలో కలిపి పొదుపు గ్రూపుల మహిళలకు నాలుగవ విడత ఆసరా కింద రూ.54 కోట్లకు పైగా మహిళల ఖాతాలకు జమకావాల్సి ఉండగా నేటికీ రూ. 30 కోట్లకు పైగా పెండింగ్ ఉన్నట్లు ఓ అధికారి ధ్రువీకరించారు. కేవలం కందుకూరు నియోజకవర్గంలోనే కాదు జిల్లావ్యాప్తంగా, ఇంకా చెప్పాలంటే రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉందని ఆ అధికారి వివరించారు. చెక్కుల పంపిణీ అయితే జరిగింది కానీ అందుకనుగుణంగా నగదు విడుదల కాలేదని, విడతల వారీగా నగదు విడుదల అవుతున్నదని, వచ్చిన నగదును వచ్చినట్లు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జమచేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మొదట ఎస్సీ సామాజికవర్గంలోని గ్రూపులకు, ఆ తర్వాత ఎస్టీ సామాజికవర్గంలోని పొదుపు గ్రూపుల మహిళలకు ఆసరా నగదు జమచేయాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీంతో అందుకనుగుణంగా జమ చేశామని ఆ అధికారి చెప్పటం విశేషం. ఎస్సీ, ఎస్టీ పొదుపు గ్రూపులకుమాత్రం చాలావరకు నగదు జమలు అయ్యాయని కొన్ని మండలాల్లో కొంతమేర బీసీ సామాజికవర్గంలోని పొదుపు గ్రూపులకు కూడా ఆసరా నాల్గవ విడత నగదు జమ అయ్యిందని చెబుతున్నారు. ఇప్పటివరకు జనరల్ కేటగిరిలోని పొదుపు గ్రూపుల మహిళలకు ఆసరా సహాయం ఒక్క రూపాయి కూడా జమ కాకపోగా బీసీ, మైనారిటీ వర్గాల వారికి కూడా పాక్షికంగానే నగదు జమ అయ్యాయి. బ్యాంకులకు నగదే రాలేదని బ్యాంకు అధికారులు చెబుతుండగా బ్యాంకులకు నగదు పంపించామని అయితే మార్చి నెలాఖరు కావటంతో వారు మహిళల ఖాతాలకు జమచేయనందున సమస్య ఉత్పన్నమైందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు చెబుతున్నారు. అయితే ఆసరా నగదును విడతల వారీగా కులాలవారీ ప్రయారిటీలో జమ చేయాలని ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు రావటాన్ని బట్టి ప్రభుత్వం పూర్తి స్థాయిలో నగదు విడుదల చేయలేదని అర్థమవుతున్నది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అసలు నగదు విడుదల అవుతుందా.. తమఖాతాలకు జమ అవుతుందా ? అన్న ఆందోళన పొదుపు గ్రూపుల మహిళల్లో వ్యక్తమవుతోంది. పొదుపు గ్రూపులలో చేరేది కులం, మతం ఏదైనా నిరుపేదలు, దిగువ మధ్య తరగతి వారేనని, అలాంటప్పుడు ఈ వివక్ష ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



లింగసముద్రంలో పొదుపు మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి(ఫైల్)

రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా చంద్రబాబును సీఎం చేయాలి : వీపీఆర్

కావలి, ఏప్రిల్ 14: మేధావులైన అధ్యాపకులు, ఉపాధ్యాయులు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నారా చంద్రబాబు నాయుడుని సీఎం చేయాలని ఎన్డీయే కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం కావలి, ఉదయగిరి నియోజక వర్గాల ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల కరస్పాండెంట్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులతో టీడీపీ నేతలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటిలో కొన్నింటిని టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన నేపథ్యంలో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు ఏమవుతుందో గుర్తించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే, సమాజ హితంకోరే ఉపాధ్యాయులు, అధ్యాపకులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేసి చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నేతను సీఎంగా చేసుకోవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా, యువతకు ఉపాధి రావాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో కావలి, ఉదయగిరి టీడీపీ కూటమి అభ్యర్థులు కావ్య క్రిష్ణారెడ్డి, కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్, విద్యాసంస్థల ప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

శ్రీరామనవమి ఉత్సవాల ప్రారంభం

కొండాపురం: మండలంలోని పలుగ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. భీమవరప్పాడులో వెలసి ఉన్న సీతారామచంద్రుని ఆలయంలో ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. వివిధ పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

అల్లూరు : అల్లూరుపేటలో ఉన్న సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై కార్యక్రమాలు ధ్వజారోహణం, శేషవాహన సేవ, రాత్రికి హంస వాహనసేవతో ముగిశాయి.

రెండు బైక్‌ల ఢీ ముగ్గురు బేల్దారి కూలీల మృతి

పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం • మృతులంతా శ్రీకాకుళం జిల్లావాసులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 14: నెల్లూరు నగర శివారు ప్రాంతమైన కొత్తూరు ఫైరింగ్ రేంజ్ సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు బేల్దారి కూలీలు మృతి చెందారు. సౌత్‌ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు, నెల్లూరు ఉమ్మారెడ్డిగుంట ప్రాంతానికి చెందిన కే రామయ్య(44), కే తమిటయ్య(60), ఎం సిమయ్య (42)లు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పొదలకూరుకి పనుల కోసం వెళ్లారు. పనులు ముగించుకొని ముగ్గురు ఒకే బైక్‌పై సాయంత్రం నెల్లూరుకి బయలుదేరారు. శివారు ప్రాంతమైన కొత్తూరు ఫైరింగ్ రేంజ్ సమీపానికి చేరుకునేసరికి నెల్లూరు నుంచి పొదలకూరు వైపు వేగంగా వెళ్తున్న బుల్లెట్ బైక్ ఢీకొంది. దీంతో అదుపు తప్పడంతో బైక్‌పై ఉన్న ఆ ముగ్గురు రోడ్డుపై పడ్డారు. సంఘటనా స్థలంలోనే రామయ్య మృతిచెందాడు. తీవ్రగాయాలైన మిగతా ఇద్దరిని స్థానికులు 108 సిబ్బంది సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే తమిటయ్య, సిమయ్యలు కూడా మృతిచెందారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబసభ్యులు వైద్యశాలకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న సౌత్‌ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రోశయ్య, ఎస్‌ఐ కిశోర్‌బాబులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

మృతులంతా శ్రీకాకుళం జిల్లావారే..

శ్రీకాకుళంజిల్లా టెక్కిలికి చెందిన రామయ్య, తులసమ్మ దంపతులు. వారికి లక్ష్మీనారాయణ, గణేష్, కిరణ్‌కుమార్‌లు సంతానం. బేల్దారి పనుల నిమిత్తం రామయ్య రెండేళ్ల కిత్రం నెల్లూరుకు వచ్చారు. శ్రీకాకుళం జిల్లా జనుమూరుకు చెందిన సిమయ్య, కృష్ణవేణి దంతులు. వారి కుమార్తె రాజేశ్వరి, ఆయన 15 ఏళ్ల క్రితం పనుల కోసం నెల్లూరు వచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం చిట్టవలసకు చెందిన తవిటయ్య, రాజమ్మ దంపతులు. వారి కుమార్తె లక్ష్మి. ఆయన 12 ఏళ్ల క్రితం పనుల కోసం ఇక్కడికి వచ్చారు. ఈ ముగ్గురు నెల్లూరు ఉమ్మారెడ్డిగుంటలో నివాసం ఉంటున్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ ముగ్గురు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు చూసి అక్కడున్నవారంతా కన్నీంటి పర్యంతమయ్యారు.



ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందిన సిమయ్య, తమిటయ్య



ప్రమాదస్థలంలో తిరుపతయ్య మృతదేహం

వాడవాడలా అంబేడ్కర్ జయంతి

కందుకూరు, ఏప్రిల్ 14 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. కందుకూరు సబ్‌కలెక్టర్ జీ విద్యాధరి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి, స్థానిక టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తన కార్యాలయంలో నివాళులర్పించడంతో పాటు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో అంబేడ్కర్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్త దాతలను అభినందించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్, పలువురు పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకుడు వర్లా దేవదాసు, జలదలంకి నరసింహారావు ఆధ్వర్యంలో, సీపీఎం నాయకులు ఎస్‌ఏ గౌసు, బీజేపీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, బూషయ్య, రాఘవులు, వరప్రసాద్, ఏఏడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గేరా చిరంజీవి, చనమాల కోటేశ్వరరావు, ముప్పవరపు కిషోర్, నరసయ్య, రావులకొల్లు బ్రహ్మానందం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. దోబుగుంటలోనూ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

కావలిటౌన్ : పట్టణంలోని ముసునూరులోని కావ్య కృష్ణారెడ్డి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ మాల్యాద్రి, దిలీప్‌కుమార్, వెంకట్రావు ఉన్నారు. స్థానిక ట్రంకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి, తుమ్మలపెంట రోడ్డులోని అంబేడ్కర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్, దావులూరి శ్యామ్‌సన్, జగదీష్ ఉన్నారు.

● సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ వెంకయ్య, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



అనంతసాగరం: నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



సంగం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



సీతారామపురం: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

అల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది నాగరాజు, పెంచలబాబు తదితరులతో కలసి అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో జ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అల్లూరు పాతబస్టాండు కూడలిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, నాయకులు సింహాద్రి, పప్పు సుధాకర్, బాలకృష్ణంరాజు, నరేంద్ర, మాల్యాద్రి పాలాభిషేకం చేశారు.

లింగసముద్రం: స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మాల్యాద్రి, కండే మాలకొండయ్య, ఏ.నర్సయ్య, మాజీ ఎంపీపీ పీ.బాలకోటయ్య, మాజీ సర్పంచు నాగేశ్వరరావు పాల్గొన్నారు. లింగసముద్రం ఎస్సీ కాలనీలో యువకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు.

ఉలవపాడు : స్థానిక అంబేడ్కర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కొల్లూరుపాడు, ఉలవపాడు, చాకిచర్లలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ జనసేన నాయకులు దేవళ్ల భాస్కరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చాకిచర్లలో డాక్టర్ రాజేష్, సుస్మిత నివాళులర్పించారు.

కొండాపురం: ఉలవపాడు టీడీపీ కార్యాలయంలో నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలినేని రమేష్, దాసరి అశోక్, నర్రా శివన్నారాయణ, దేవినేని అశోక్ ఉన్నారు.

గుడ్లూరు : స్థానిక ఎన్టీఆర్‌ట్రస్ట్ భవన్‌లో టీడీపీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ బొమ్మసెంటర్‌లో దళిత నాయకుడు గంగోలు మాల్యాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, సీపీఎం మం డల కన్వీనర్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు చెన్నారెడ్డి మహేష్, రావూరి వేణు, అజయ్‌బాబు, ప్రజాసంఘాల నాయకులు ఎం.జాలయ్య పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి కొర్రా చంద్రశేకర్ ఆధ్వర్యంలో న్యాయవాది సునీల్, సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై భీం రవిచంద్ర, సింహాద్రిరావు, ఎస్.మల్లి, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, ఎంఆర్‌పీఎస్ జిల్లా నేత జయరాజ్, పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు.

● బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో గండూరి శ్రీనివాలు, నీలం విజయ్‌కుమార్, బత్తుల రవిచంద్ర పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఎంజీఆర్ బస్టాండ్ వద్ద జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలో ఆత్మ కూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. బ స్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం జరిగిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్ చార్జీలు మహేష్ మాదిగ, టి.లక్ష్మయ్య మాదిగ, ఆది నారాయణమాదిగ, రవి మాదిగ, చిన్నయ్య, బాలాజీ పాల్గొన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెంకటయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.



కందుకూరు: నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి



లింగసముద్రం: నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



ఉలవపాడు: సంబరాల్లో టీడీపీ, జనసేన నేతలు



గుడ్లూరు : నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



బిట్రగుంట : రక్తదానం చేస్తున్న వీఎస్ఆర్‌పేట యువసేన సభ్యులు



కలువాయి: రక్తదానం చేస్తున్న యువత

సంగం: తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నాయకుడు కృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు. శివాజీ సెంటర్‌లో ఏబీవీపీ విద్యార్థుల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఉడ్‌హౌస్ పేట, సిద్ధీపురం, పడమటిపాళెంలో వేడుక చేశారు.

అనంతసాగరం: సోమశిలలో అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన వేడుకలో మునగపాటి సునీత, మాజీ ఎంపీపీ సుబ్బరాజు, పెంచలయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక సచివాలయం, బస్టాండ్ సెంటర్‌లో సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమార్, ఎలిషా కుమార్, ఎంపీటీసీ అల్లూరురాజు, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓబులేసు, కిరణ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక అంబేడ్కర్ భవన్ జరిగిన వేడుకలో మేకపాటి రాజగోపా లొరెడ్డితో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. చెంచురామయ్య అతిథిగృ హంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న ఆధ్వర్యంలో టీడీ పీ నాయకులు, యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నెహ్రూబాబు, మేకపాటి గౌ తంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ టీ.గోపీకృష్ణ పాల్గొన్నారు. దళిత, గిరిజన అంబేడ్కర్ సేవాసమితి, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు కాకి శ్రీనివాసులు, జాషువా, ప్రసాద్‌లు అంబేడ్కర్ విగ్రహానికి నివా ళులర్పించారు. పుల్లాయపల్లి పీఎస్ కార్యాలయంలో సర్పంచ్ కల్లూరి శ్యామలాదేవి కృష్ణారెడ్డి కేక్ కట్ చేశారు.

కలువాయి: అంబేడ్కర్ ఇండియా మిషన్ కలువాయి మండల శాఖ, తెలుగుదేశం, బీజేపీ నాయకులు ఆదివారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు నాయుడు, కిషోర్‌రెడ్డి, మల్లికార్జున, దండు పెంచలయ్య, డాక్టర్ ఓబుల్‌రాజ్, గోపాల్ పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ కలువాయి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ జీ.పెంచల పుల్లయ్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

నేడు ఎన్నికల అధికారులకు శిక్షణ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 14: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో సోమవారం సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పీవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో మేకపాటి ప్రచారం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 14: రాచవారిపల్లి, జంగాలపల్లి, తురకపల్లి, భైరవరం గ్రామాల్లో ఆదివారం వైసీపీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయసంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, సర్పంచులు నంబూరి వసంత, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

కలువాయి: దాచూరు, కమ్మపాళెం, ముక్కుతిప్ప, పెరంకొండ, దాసరిపల్లె, వెరుబొట్లపల్లి గ్రామాల్లో ఆదివారం వైసీపీ వెంకటగిరి అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, మాకిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, పంగా పెంచలనరసారెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా 'వేదగర్భ' వార్షికోత్సవం

సీతారామపురం, ఏప్రిల్ 14: స్థానిక వేదగర్భ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పిడతల సుధాకర్, సిగె. కొండయ్య, బ్రహ్మయ్య, రంగనాయకులు, రమేష్ వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను అలరించాయి. కార్యక్రమంలో కరెస్పాండెంట్ బొల్లుపల్లి రామమోహన్, స్కూల్ హెడ్‌మిస్ రాగిషా, లీలక్రిష్ణ, ఉపాధ్యాయులు, తలిదండ్రులు పాల్గొన్నారు.



భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు

బొల్లినేనిని కలిసిన కాకర్ల



ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 14: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బొల్లినేని వెంకటరామారావును శనివారం రాత్రి ఉదయగిరి నియోజవకర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ హైదరాబాదులోని తన అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తనతోపాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయానికి సహకరించాలని, నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని బొల్లినేనిని కోరినట్లు కాకర్ల తెలిపారు.

రేపటి నుంచి కాకర్ల ప్రచారం

వరికుంటపాడు: నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ మండలంలో మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. తొలిరోజు గణేశ్వరాపురం నుంచి ప్రచా రాన్ని ప్రారంభించి తూర్పురొంపిదొడ్ల, దక్కనూరు, తూర్పుకొండారెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, వేంపాడు పంచాయతీల్లో కొనసాగుతుం దన్నారు. 19వ తేదీ వరకు మిగిలిన పంచాయతీల్లోనూ యథావిధిగా ప్రచారం చేపడతామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకు లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి తాగునీరు, రోడ్లు

● కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

కలువాయి: టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి తాగునీరు, రోడ్డు వేయిస్తానని వెంకటగిరి తెలుగుదేశం అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ హామీ ఇచ్చారు. వెంకటరెడ్డిపల్లిలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తెలియజేశారు. రూ.4వేలు పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం గురించి తెలిపారు. చదువుకొంటున్న మన బిడ్డలు భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబు నాయుడును సీఎం చేసుకోవాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా మా కాలనీకి రోడ్డు లేదు. కనీసం మాకు తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఐదేళ్ల వైసీపీ పాలన ఇలా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్ల దాడి చేశారని వైసీపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. టీడీపీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని తప్పకుండా అధికారంలోని వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆమె వెంట టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జీ.వెంకటేశ్వర్లునాయుడు, సుదర్శన్, రాజేష్‌రెడ్డి, ఎస్ఎస్ఆర్ నాయుడు, జనసేన నాయకులు వెంకటపతి, మనోహర్ పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ

ఉత్తుత్తి సవాళ్లు మానండి : టీడీపీ

బిట్రగుంట, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసీపీ నాయకులు చేస్తున్న ఉత్తుతి సవాళ్లు మాని నిజాయితీగా వ్యవహరించాలని టీడీపీ నాయకులు హితవు పలికారు. బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ బోగోలు మండల వైసీపీ నేత చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. వైసీపీ నుంచి ఏ ఒక్కరూ టీడీపీలో చేరలేదని తొడకొట్టడం కాదని, విశ్వనాథరావుపేటలో ఇద్దరు వార్డు నెంబర్లు, ఏనుగులబావి పంచాయతీ వైస్ సర్పంచు, అల్లిమడుగు పంచాయతీ వార్డు నెంబర్లు దాసరి శ్రీనివాసులు, రమేష్, జేపీగూడూరు మాజీ సర్పంచు మాలకొండయ్య, వార్డు నెంబరు ఆనందరావు వైసీపీ నుంచి గెలుపొందిన వారు కాదా అని ప్రశ్నించారు. గతంలో నువ్వు చేసిన అవినీతి ఆరోపణపై ప్రసన్నుడి సన్నిధిలో ప్రమాణానికి రాకుండా పోలీసులతో చెప్పి ఆపింది ఎవరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎల్.సుధీర్‌బాబు, కే.వేంకటేశ్వర్లురెడ్డి, కే.రఘురామ్‌నాయుడు, వై.వెంకటేశ్వర్లురెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, ఆర్.విజయకుమార్‌యాదవ్, పాల్గొన్నారు.

అశ్వవాహనంపై సంగమేశ్వరుడు

సంగం, ఏప్రిల్ 14: సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి స్వామివారు అశ్వవాహనంపై ఊరేగారు. అంతకుముందు కామాక్షీదేవి సంగమేశ్వరస్వామి ఉత్సవవిగ్రహాలను అశ్వవాహనంపై ఉంచి గజ పూలమాలలతో అలంకరించారు. స్వామి ఉత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరుడు

వైభవంగా హంస వాహనసేవ

శ్రీరామ నవమిని పురస్కరించుకుని సిద్ధీపురంలో వెలసిన సీతారామస్వామి శనివారం అర్ధరాత్రి హంస వాహనపై ఊరేగారు. ఈ సందర్భంగా సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలను గజ పూలమాలలతో అలంకరించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి గౌడ్ సంఘంవారు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గెలిస్తే న్యాయం.. ఓడితే సాయం..!

● ఇదే నా నినాదం : పసుపులేటి సుధాకర్

బిట్రగుంట, ఏప్రిల్ 14: ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు న్యాయం చేస్తా.. ఓడితే సాయం చేస్తా.. అనే నినాదంతో ప్రజాతీర్పు కోసం స్వతంత్ర అభ్యర్థిగా కావలి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నానని పీఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో ఆదివారం ఆయన తన ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. విశ్వనాథరావుపేట నుంచి ఏడుగురు, తాటిచెట్లపాలెం నుంచి 30 మంది ఆయనకు అండగా ఉంటామని కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నిస్వార్థంతో నియోజకవర్గంలోని ప్రజలకు సేవలు చేస్తున్నానని తెలిపారు. పార్టీల అండలేక పోయినా ప్రజాబలం ఉందన్న నమ్మకంతోనే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, బ్రహ్మయ్య, షఫీ, అన్వర్, జగదీష్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.



తనకు మద్దతు తెలిపిన వారితో పసుపులేటి సుధాకర్

ఓటమి భయంతో జగన్నాటకాలు : కావ్య

కావలి, ఏప్రిల్ 14: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఓటమి భయంతో జగన్నాటకాలు ప్రారంభించారని, ఈ నాటకాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 39వ వార్డు పెంకుల ఫ్యాక్టరీ ప్రాంతంలో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ స్థానిక నేతలతో కలిసి ఆయన ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అందించే పథకాల గురించి వివరిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో అధికారం కోసం సొంత బాబాయిని హత్య చేయించి సానుభూతి డ్రామాలాడారన్నారు. అలాగే కోడికత్తి డ్రామా ఆడి ఓ దళితుడి జీవితాన్ని ఐదేళ్ల జైలులో మగ్గబెట్టాడని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రాళ్లతో దాడి డ్రామాకు జగన్ తెరతీశారన్నారు. ఇదంతా ఎన్నికల స్టంట్‌లో భాగమేనని ప్రజలకు అర్థమైందన్నారు. ఈ రాక్షస పాలనను అంతమొందించేందుకు నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటానికి కావలిలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న టీడీపీ అభ్యర్థి కావ్య

ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

కందుకూరు, ఏప్రిల్ 14 : కందుకూరులోని 18వ వార్డు, సీపీఐ, కోటారెడ్డి హాస్పిటల్ ఎదురు ప్రాంతంలో ఆదివారం టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య స్థానిక జనసేన, బీజేపీ నాయకులతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావుని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించుకొని నియోజకవర్గంతోపాటు నెల్లూరు పార్లమెంట్ అభివృద్ధికి మద్దతుగా నిలబడాలని ఇంటింటి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జ్ ఘట్టమనేని హరిబాబు, నాయకులు మల్లేపల్లి ప్రసాదరావు, ముచ్చు శ్రీను, నగర జైకృష్ణ, ఈదర రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్న సౌజన్య

గొట్టిగుండాలలో టీడీపీ ఇంటింటి ప్రచారం

కొండాపురం, ఏప్రిల్ 14: మండలంలోని గొట్టిగుండాలలో ఆదివారం తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు కుంకు జయమ్మ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందచేశారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు కామేపల్లి సుబ్బారావు, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్టయ్య, యూనిట్ ఇన్‌చార్జి రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

రోడ్డు తవ్వారు.. వదిలేశారు..!

● వాహనదారులు, ప్రజలకు తప్పని తిప్పలు

లింగసముద్రం, ఏప్రిల్ 14 : మండలంలోని సత్యనారాయణపురం - అన్నెబోయినపల్లి గ్రామాల మధ్య ఉన్న పంచాయతీరాజ్ రోడ్డును అభివృద్ధి పేరుతో నాలుగు నెలల క్రితం తవ్వి నిర్మాణ పనులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లతరబడి గుంతలమయమై ప్రయాణానికి అనువుగా లేని ఈ రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్న క్రమంలో జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.40 లక్షలు మంజూరు చేశారు.దీంతో పంచాయతీరాజ్ అధికారులు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా ఆయన పాత రోడ్డును తవ్వేశారు. అయితే నిధులు విడుదలలో కొంత సాంకేతిక సమస్య ఏర్పడింది. అయితే రెండు నెలల క్రితం ఆ సమస్య తొలగినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పనులు చేస్తే బిల్లులు మంజూరు కావనే భయంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుండా వదిలేసినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా మండలంలోని వెంగళాపురం నుంచి ఊట్లపాలెం వరకు ఉన్న తారు రోడ్డు, శింగరపాలెం నుంచి గంగపాలెం వరకు, విశ్వనాథపురం నుంచి వీఆర్ కోట వరకు, అన్నెబోయినపల్లి నుంచి అంగిరేకులపాడు వరకు ఉన్న లింకు రోడ్లు గుంతలమయమై అధ్వానంగా ఉన్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



సత్యనారాయణపురం-అన్నెబోయినపల్లి గ్రామాల మధ్య తవ్వి వదిలేసిన రోడ్డు

టీడీపీలో చేరిన మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ

ఆత్మకూరు, ఏప్రిల్ 14: వైసీపీకి చెందిన ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ ఆదివారం టీడీపీలో చేరారు. నాగులపాడులో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ఆమెకు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే వైసీపీకి చెందిన ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్, కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి టీడీపీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చేరికతో పార్టీకి మరింత బలం చేకూరినట్లయింది.



వెంకటరమణమ్మకు కండువా వేస్తున్న ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం

టీడీపీలోకి అల్లిమడుగు వాసులు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 14: బోగోలు మండలం అల్లిమడుగు గ్రామంలోని అన్ని కుటుంబాలు టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, కుంచాల తిరుమలేష్‌ల ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీలో చేరారు. కావలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దగుమాటి(కావ్య) క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి వారికి పార్టీ కండువ కప్పారు. అనంతరం టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, జిల్లా నేత కాండ్ర రఘురామనాయుడు ఆధ్వర్యంలో నాగులవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

22న అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు

కందుకూరు, ఏప్రిల్ 14: భక్తుల సౌకర్యార్థం కందుకూరు డిపో నుంచి అరుణాచలంకు ఈనెల 22న కందుకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజరు పెద్దన్నశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణతో పాటు శివకంచి, విష్ణుకంచి, కంచికామాక్షి, సమయపురం, జంబుకేశ్వరం, శ్రీరంగం, మధురై, రామేశ్వరం, తంజావూరు, చిదంబరం తదితర క్షేత్రాలను దర్శించడం జరుగుతుందని ఆయన తెలిపారు. నాలుగు రోజుల ఈ యాత్రలో ప్రయాణీకులకు భోజన సౌకర్యంతో కలిపి టిక్కెట్ రూ.5,200గా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7382889870ను సంప్రదించాలని కోరారు.

భగవద్గీతపై ప్రచారం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 14: తెలుగు సంవత్సరం ప్రారంభం సందర్భంగా త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక దుత్తలూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం గంగిరెడ్డిపల్లి, గానుగపెంటపల్లి, మాసాయిపేట, సున్నంవారిచింతల, వీరారెడ్డిపల్లి, గుడినరవ గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి భగవద్గీతపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంధాలతో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రసాద్, కమిటీ సభ్యులు నరసింహులు, నాగమ్మ, మహేంద్ర, మధు, రమణమ్మ, రమణయ్య, ప్రేమ్‌కుమార్, కల్యాణి, కాశమ్మ, గుణశేఖర్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు